www.udyamakeratam.com
PRGI No. : TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 115 | 14-10-2026 | బుధవారం | పేజీలు: 8 | వెల : రూ.2/- |



## హైదరాబాద్‌కు డబుల్ డెక్కర్ కారిడార్!

- ఎల్బీనగర్-హయత్‌నగర్ కారిడార్‌కు కేంద్రం ఆమోదం
- జనవరి నుంచి హైదరాబాద్-విజయవాడ హైవే విస్తరణ పనులు
- కృష్ణానదిపై సోమశిల వద్ద ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి
- ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి భేటీ

2



## గ్రాట్యుటీకి గ్రీన్‌సిగ్నల్

ఎఫ్‌టీఈల 20 ఏళ్ల పోరాటానికి ఫలితం

2

## సీఈసీ రాజీనామా చేయకుంటే అభిశంసన తప్పదు



- ఎంపీ శశిథరూర్ హెచ్చరిక!
- ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు జరిగాయని ఆరోపణ
- తొలగించిన అర్హుల ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్

4

# సింగరేణి కార్మికులకు దసరా కానుక

### పర్మినెంట్ ఉద్యోగులకు రూ.1.53 లక్షల లాభాల వాటా

- కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,500 బోనస్
- 15 రోజుల్లో పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాల ఫైళ్లు క్లియర్
- కార్మికుల సొంతింటి కల సాకారం చేస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



దసరా పండుగ వేళ సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. సంస్థ ఆర్జించిన నికర లాభాల్లో 34 శాతం వాటాను కార్మికులకు కేటాయిస్తూ, ఒక్కో పర్మినెంట్ ఉద్యోగికి సగటున రూ.1,53,912 లాభాల బోనస్, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,500 చొప్పున పండుగ కానుకగా చెల్లించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. పర్మినెంట్, కాంట్రాక్ట్ సిబ్బంది ఇరువర్గాల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

- హైదరాబాద్, అక్టోబర్ 13 (ఉద్యమ కెరటం):

వివరాలు 2లో..

## జంతర్‌మంతర్ వద్ద మళ్లీ ఉద్రిక్తత!



- బారికేడ్లు దాటి దూసుకెళ్లిన సీజేపీ కార్యకర్తలు
- సౌరవ్ దాస్ సహా పలువురు ముఖ్య నేతల అరెస్ట్
- దేశమంతా జంతర్‌మంతర్ అవుతుందన్న అభిజీత్ దీప్కే

వివరాలు 3లో..



## అధికారం అజమాయిషీకి కాదు.. ప్రజల సాధికారతకే!

- ప్రజలను నియంత్రించడం కాదు.. అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- సాంకేతికత, సమాచారం, ఆవిష్కరణల ఫలాలు అందరికీ అందాలి
- పోటీ కంటే సహకారానికి ప్రాధాన్యం
- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ





## ప్రజాస్వామ్య రక్షణకు కలిసికట్టుగా పోరాడుతాం

- ఇండియా కూటమి భేటీలో రాహుల్ గాంధీ
- రాహుల్ నివాసంలో ఇండియా కూటమి నేతల కీలక భేటీ
- ఓటర్ల జాబితాల సవరణ, ఓట్ల తొలగింపుపై చర్చ
- మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్‌పై రాహుల్ తీవ్ర విమర్శలు

4

దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలన్నీ కలిసికట్టుగా పోరాడతాయని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ప్రజల నిరసన తెలిపే హక్కును అణచివేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.



## వాదిస్తే నిజాలు అబద్ధాలు కావు..

4

లద్దాఖ్‌పై చైనాకు భారత్ కౌంటర్

లద్దాఖ్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే



3

## రైతు డిస్కమ్.. అన్నదాత మెడకు ఉరితాడే!

ఉచిత విద్యుత్‌కు పాతరేసేందుకే సర్కారు కుట్ర: హరీశ్ రావు



## నీట్ పేపర్ లీకేజీలకు చెక్ పడాల్సిందే!

- ఒకే ప్రశ్నపత్రం విధానానికి స్వస్తి పలకాలి
- పరీక్ష ప్రారంభానికి నిమిషాల ముందే ప్రశ్నపత్రం సిద్ధం చేయాలి
- పరీక్షల వ్యవస్థలో సమూల మార్పులకు నందన్ నిలేకని సూచనలు

4

## న్యాయవ్యవస్థపై కాంగ్రెస్ కుట్రలు!

సుప్రీంకోర్టు వద్ద లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ శ్రేణులు ప్రదర్శించిన నాటకీయ వైఖరిని దేశ ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు అన్నారు. భారత న్యాయవ్యవస్థపై ప్రజలకున్న విశ్వాసాన్ని ఉద్దేశపూర్వకంగా దెబ్బతీసేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు.

3



- సుప్రీంకోర్టు వద్ద రాహుల్ తీరును ఖండించిన రామచందర్ రావు
- హైకోర్టు బార్ కౌన్సిల్ వద్ద న్యాయవాదుల భారీ నిరసన

## కాంగ్రెస్ నిరసనలన్నీ నాటకాలే

- దేశంలో అరాచకం సృష్టించేందుకు విపక్షాల కుట్ర
- తీర్పులు అనుకూలంగా రాకపోతే సీజేఐ గద్దె దిగాలా?
- నిబంధనల ప్రకారమే ఓటర్ల జాబితా సవరణ
- రేవంత్ రెడ్డిది ద్వంద్వ నీతి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

3





## కానిస్టేబుల్ పోస్టుల్లో ఎస్టీ కోటా అమలు చేయాలి!

3

- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

# గ్రాట్యుటీకి గ్రీన్‌సిగ్నల్

**ఎఫ్‌టీఈల 20 ఏళ్ల పోరాటానికి ఫలితం**

**మంత్రి సీతక్క చొరవతో 3,800 మంది ఉద్యోగులకు లబ్ధి**

**పదేళ్ల సర్వీసు ఉన్నవారికి రూ.10 లక్షల వరకు ప్రయోజనం**

**సీఎం, డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఉద్యోగ సంఘాలు**

**హైదరాబాద్, అక్టోబర్ 13 (ఉద్యమ కెరటం):** ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయీస్ (ఎఫ్‌టీఈ)కు రాష్ట్ర ప్రభుత్వం దసరా కానుకను ప్రకటించింది. సుమారు 3,800 మంది ఉద్యోగులకు గ్రాట్యుటీతో కూడిన ఆర్థిక భరోసా కల్పిస్తూ అధికారికంగా జీవో జారీ చేసింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో ఉద్యోగుల 20 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి ఎట్టకేలకు ఫలితం లభించింది.



తాజా నిర్ణయంతో రిటైర్మెంట్ సమయంలో ఉద్యోగులకు రూ.4 లక్షల గ్రాట్యుటీ లభించనుంది. అలాగే పదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారికి కనీసం రూ.10 లక్షల వరకు ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. తమ చిరకాల కలను సాకారం చేసి, ఆర్థిక భరోసా కల్పించిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్కకు ఎఫ్‌టీఈ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఉద్యోగుల హక్కులు, ఆత్మగౌరవానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలకు తాము ఒక్కొక్కటిగా పరిష్కారం చూపుతున్నామని తెలిపారు. కష్టపడి పనిచేసిన ఉద్యోగులు రిటైర్మెంట్ తర్వాత ఆర్థిక ఇబ్బందులు పడకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమని, జీవిత చరమాంకంలో వారికి భద్రత కల్పించడం తమ బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.

# యూపీఐ చార్జీలు వాయిదా!

**దీపావళి తర్వాతే మర్చంట్ ఫీజుల వడ్డన**

**పండుగల వేళ వ్యాపారులు, ప్రజలకు ఊరట**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (ఉద్యమ కెరటం):** రూ.2,000కు పైబడిన యూపీఐ లావాదేవీలపై మర్చంట్ చార్జీల విధింపును దీపావళి పండుగ తర్వాతకు వాయిదా వేసినట్లు సమాచారం. పండుగల వేళ వినియోగదారులు, చిన్న వ్యాపారులు, రిటైల్ మార్కెట్‌పై అదనపు భారం పడకుండా చూసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రూ.2,000 దాటిన యూపీఐ చెల్లింపులపై 0.4 శాతం మేర మర్చంట్ ఫీజు విధించే ప్రతిపాదన ఉంది. వాస్తవానికి ఈ చార్జీలు అక్టోబర్ 15 నుంచే అమల్లోకి రావాల్సి ఉండగా, ఇప్పుడు దీపావళి తర్వాత అమలు చేసే అవకాశం ఉంది. దీనికి సంబంధించిన కొత్త తేదీని త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. దీపావళి సమయంలో దేశవ్యాప్తంగా మార్కెట్లలో కొనుగోళ్లు భారీగా జరుగుతాయి. ఇలాంటి సమయంలో అదనపు చార్జీలు విధిస్తే వ్యాపారులు, వినియోగదారులపై తీవ్ర ప్రభావం పడుతుందని వ్యాపార వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. దేశంలో ప్రస్తుతం అత్యధికంగా ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే కోట్లాది మంది చెల్లింపులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చార్జీల విధింపుపై ప్రభుత్వం, ఎన్‌పీసీఐ నుంచి స్పష్టమైన అధికారిక ప్రకటన కోసం వ్యాపార వర్గాలు ఎదురుచూస్తున్నాయి.

# నీళ్లు పడినా తడవని సర్టిఫికెట్లు!

**అందుబాటులోకి సరికొత్త 'మీ సేవ' పేపర్**

**సులభంగా చినిగిపోని, తడవని ప్రత్యేక కాగితం**

**నకిలీలకు చెక్ పెట్టేలా 15 అత్యాధునిక ఫీచర్లు**

**ఇకపై సర్టిఫికెట్లకు లామినేషన్ అవసరం లేదు**

**ప్రజాభవన్‌లో ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్ బాబు**



**హైదరాబాద్, అక్టోబర్ 13 (ఉద్యమ కెరటం):** ప్రభుత్వ ధ్రువపత్రాల భద్రత, మన్నిక పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. చినిగిపోకుండా, నీళ్లు పడినా త్వరగా దెబ్బతినకుండా ప్రత్యేకంగా రూపొందించిన సరికొత్త 'మీ సేవ' సర్టిఫికెట్ పేపర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఆవిష్కరించారు. కొత్త మీ సేవ సర్టిఫికెట్ పేపర్‌లో ఏకంగా 15 అత్యాధునిక భద్రతా ఫీచర్లను పొందుపరిచారు. నకిలీ సర్టిఫికెట్ల తయారీని, అనధికార నకళ్లను పూర్తిగా అరికట్టేలా వీటిని అత్యంత పకడ్బందీగా రూపొందించారు. భద్రతా కారణాల దృష్ట్యా ఈ ఫీచర్ల వివరాలను అధికారులు గోప్యంగా ఉంచారు. ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన ఈ కాగితం సులభంగా చినిగిపోదు. మడతపెట్టడం వల్ల, ఎక్కువ కాలం భద్రపరచడం వల్ల కూడా పాడవదు. దీనివల్ల ఇకపై సర్టిఫికెట్లను ఏళ్ల తరబడి మంచి స్థితిలో దాచుకునే అవకాశం ఉంటుందని, లామినేషన్ చేయించాల్సిన అవసరం కూడా తగ్గుతుందని అధికారులు వివరించారు. జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు విద్య, ఉద్యోగ తదితర అధికారిక అవసరాలకు ఉపయోగించే సర్టిఫికెట్లు ప్రజల జీవితంలో చాలా ముఖ్యమైనవని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. కొన్ని పత్రాలను జీవితాంతం భద్రంగా ఉంచుకోవాల్సి ఉంటుందని, అలాంటి పత్రాలు పాడవకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. 2011 నుంచి మీ సేవ సర్టిఫికెట్ల ముద్రణకు సెక్యూరిటీ పేపర్ వాడుతున్నప్పటికీ.. ఇప్పుడు దాని స్థానంలో మరింత నాణ్యత, భద్రత, మన్నిక కలిగిన కొత్త పేపర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాజ్ ఠాకూర్, విజయ రమణారావు, ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ కమిషనర్ టి.రవికిరణ్, ఇతర అధికారులు, సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికులకు దసరా కానుక!

- పర్మినెంట్ ఉద్యోగులకు రూ.1.53 లక్షల లాభాల వాటా
- కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,500 బోనస్
- 15 రోజుల్లో పెండింగ్ డిపెండెంట్ ఫైళ్లు క్లియర్
- కరోనాలో ఉద్యోగాలు కోల్పోయిన వారికి ఛాన్స్
- కార్మికుల సొంతింటి కల సాకారం చేస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, అక్టోబర్ 13 (ఉద్యమ కెరటం):** దసరా పండుగ సందర్భంగా సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. సంస్థలో పనిచేస్తున్న 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులకు లాభాల వాటా కింద ఒక్కొక్కరికి సగటున రూ.1,53,912, అలాగే 29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 చొప్పున దసరా బోనస్ చెల్లించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. ప్రజాభవన్‌లో మంగళవారం మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది సింగరేణి ఆర్జించిన రూ.1,754 కోట్ల నికర లాభాల్లో 34 శాతం అంటే రూ.596 కోట్లను కార్మికులకు పంచుతున్నట్లు తెలిపారు.

**కార్మికుల సొంతింటి కల సాకారం**

సింగరేణి కార్మికులకు సొంత ఇళ్లు నిర్మించుకునేందుకు అనువైన లేఅవుట్లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న 250 నుంచి 300 డిపెండెంట్ ఆర్డర్లను 15 రోజుల్లో క్లియర్ చేయాలని, కరోనా సమయంలో ఉద్యోగాలు కోల్పోయిన వారిని వన్-టైమ్ ఆప్షన్ కింద తిరిగి విధుల్లోకి తీసుకోవాలని నిర్ణయించారు. మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం కార్మికులు కొత్తగూడెం వెళ్లకుండా అన్ని ఏరియా ఆస్పత్రులకు మెడికల్ బోర్డులను విస్తరిస్తామన్నారు. పాత జిల్లాల్లోని గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. కార్మికుల పెర్క్స్, అలవెన్సులపై పడే ఆదాయపు పన్నును సంస్థే భరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

**కొత్త బ్లాక్‌ల సాధనలో బీఆర్ఎస్ విఫలం**

గత పదేళ్లలో కొత్త బొగ్గు బ్లాక్‌లను సాధించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని భట్టి విమర్శించారు. 141 బొగ్గు బ్లాక్‌ల వేలం జరిగినా సింగరేణిని అందులో పాల్గొననివ్వకపోవడం వల్ల సంస్థ విస్తరణ ఆగిపోయిందన్నారు. విద్యుత్ సంస్థల నుంచి సింగరేణికి రావాల్సిన రూ.29 వేల కోట్ల బకాయిలు బీఆర్ఎస్ హయాంలోనే పేరుకుపోయాయని, వాటిని ఇప్పుడు క్రమంగా రాబడుతున్నామని వివరించారు. పోటీతత్వాన్ని తట్టుకునేలా బొగ్గు ధరలను సర్దుబాటు చేస్తామన్నారు.

**సింగరేణిని భ్రష్టు పట్టించారు: శ్రీధర్ బాబు**

పదేళ్లు అధికారంలో ఉండి సింగరేణిని భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు 'పోరుబాట' పేరుతో ఆందోళనలకు



పిలుపునివ్వడం హాస్యాస్పదమని మంత్రి శ్రీధర్ బాబు ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నప్పుడు కార్మికుల సమస్యలను ఎందుకు పరిష్కరించలేదో హరీశ్ రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం పనిచేస్తుంటే అడ్డుకోవడం సరికాదన్నారు. ఈ సమావేశంలో పలువురు కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు, ఇంధన శాఖ స్పెషల్ సీఎస్ నవీన్ మిట్టల్, సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌కు డబుల్ డెక్కర్ కారిడార్!

- ఎల్బీనగర్-హయత్‌నగర్ కారిడార్‌కు కేంద్రం ఆమోదం
- జనవరి నుంచి హైదరాబాద్-విజయవాడ హైవే విస్తరణ పనులు
- కృష్ణానదిపై సోమశిల వద్ద ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి
- పర్యాటకానికి ఊతంగా 5 రోప్‌వేలు, 3 ఆర్వోబీలకు గ్రీన్‌సిగ్నల్
- దిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి భేటీ

**న్యూ ఢిల్లీ, అక్టోబర్ 13 (ఉద్యమ కెరటం):** తెలంగాణ రాష్ట్రంలో రహదారి కనెక్టివిటీని మెరుగుపరిచి, ప్రయాణ కష్టాలను తగ్గించడంతో పాటు ఆర్థిక, పర్యాటక అభివృద్ధికి దోహదపడే పలు ప్రాజెక్టులకు కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించింది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. మంగళవారం దిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులపై మంత్రి కోమటిరెడ్డి చేసిన విజ్ఞప్తులపై గడ్కరీ సానుకూలంగా స్పందించి అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేశారు.

**ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్**

హైదరాబాద్‌లో వేగంగా విస్తరిస్తున్న ఎల్బీనగర్-హయత్‌నగర్



మార్గంలో సుమారు 54 కాలనీల్లో 10 లక్షల మందికి పైగా నివసిస్తున్నారు. ఇక్కడ నిత్యం ట్రాఫిక్ సమస్యలతో పాటు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, దీనికి పరిష్కారంగా డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని మంత్రి కోమటిరెడ్డి ప్రతిపాదించగా.. కేంద్ర మంత్రి దానికి ఆమోదం తెలిపి వార్షిక ప్లాన్‌లో చేర్చారు. అలాగే, హైదరాబాద్-విజయవాడ (ఎన్ హెచ్-65) రహదారిపై 17 బ్లాక్ స్పాట్స్ గుర్తించి ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నా ప్రస్తుతం ఉన్న 4 లేన్లపై ట్రాఫిక్ పెరిగిందని కోమటిరెడ్డి వివరించారు. దీనిపై స్పందించిన గడ్కరీ.. ఈ ఆరు లేన్ల విస్తరణకు నవంబర్‌లో టెండర్లు పూర్తిచేసి, 2027 జనవరిలో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

**సోమశిల వద్ద ఐకానిక్ బ్రిడ్జి**

రెండు తెలుగు రాష్ట్రాలను అనుసంధానిస్తూ ఎన్ హెచ్-167కె పై కృష్ణానదిపై సోమశిల వద్ద ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి గడ్కరీ అంగీకారం తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి కోమటిరెడ్డి ఈ ప్రాజెక్టు ప్రాముఖ్యతను వివరించారు. ఈ వంతెన పూర్తయితే సోమశిల నుంచి సంగమేశ్వర మీదుగా తిరుపతి వెళ్లే వారికి 80 కి.మీ. (దాదాపు 3 గంటల) ప్రయాణ సమయం ఆదా కావడంతో పాటు పర్యాటకంగా ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అలాగే, హైదరాబాద్-శ్రీశైలం (ఎన్ హెచ్-765) ఎలివేటెడ్ కారిడార్‌కు కొత్త డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులను గడ్కరీ ఆదేశించారు.

**రోప్‌వేలు.. ఆర్వోబీలు.. జాతీయ హోదా**

రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి పర్వతమాల పథకం కింద 5 రోప్‌వేల ఏర్పాటుకు, సేతు బంధన్ కింద 3 రైల్వే ఓవర్ బ్రిడ్జిల (ఆర్వోబీ) నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవేతో పాటు, పుల్లూరు నుంచి నల్గొండ (పుల్లూరు-అలంపూర్-జట్రపోలు-పెంట్లవెల్లి-కొల్లాపూర్-లింగాల-అచ్చంపేట-డిండి-దేవరకొండ-మల్లేపల్లి-నల్గొండ) వరకు ఉన్న రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేసే ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. సీఆర్ఐఎఫ్ కింద 34 రహదారి పనులకు నిధులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో జరిగే ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సదస్సుకు గడ్కరీని మంత్రులు ఆహ్వానించారు. ఈ సమావేశంలో ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ తాగునీటికి ఢోకా లేదు!

- ఎల్-నినో ముప్పున్నా.. ముందస్తు చర్యలు
- అదనంగా 60 ఎంజీడీల నీటి సరఫరా
- నీటిని పొదుపు చేయాలని సీఎస్ పిలుపు
- గృహేతర అవసరాలకు ప్రత్యేకంగా 'గ్రీన్ ట్యాంకర్లు'

**హైదరాబాద్, అక్టోబర్ 13 (ఉద్యమ కెరటం):** ఎల్-నినో పరిస్థితుల నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఆటంకం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు తెలిపారు. తాగునీటి సన్నద్ధతపై జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ కమిషనర్లు, జలమండలి అధికారులతో మంగళవారం ఆయన సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం నగరానికి జంట జలాశయాలు, మంజీరా, కృష్ణా, గోదావరి



నదుల ద్వారా 560 ఎంజీడీల నీరు అందుబాటులో ఉందని, భవిష్యత్ అవసరాల కోసం అదనంగా మరో 60 ఎంజీడీల నీటిని తెచ్చేలా ప్రణాళిక రూపొందించామని సీఎస్ వివరించారు. మల్లన్నసాగర్‌లో 5 టీఎంసీల నీరు ఉందని, నవంబర్ నాటికి పైప్‌లైన్ పనులు పూర్తైతే అక్కడి నుంచి 20 ఎంజీడీల నీరు వస్తుందన్నారు. అలాగే మంజీరా, సింగూరుపై ఆధారపడిన మెదక్, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాలకూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు. నగరంలో భూగర్భ జలాలు తగ్గడంతో ట్యాంకర్లకు డిమాండ్ పెరిగిందని, గేటెడ్ కమ్యూనిటీలు ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసిన నీటిని మాత్రమే గార్డెనింగ్, వాహనాలు కడిగేందుకు వాడాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేకంగా 'గ్రీన్ ట్యాంకర్లను' అందుబాటులోకి తెస్తున్నామన్నారు. నగర ప్రజలు కేవలం 20 శాతం నీటిని పొదుపు చేసినా రోజుకు 80 ఎంజీడీల నీరు ఆదా అవుతుందని, ఎవరూ తాగునీటితో వాహనాలు కడగొద్దని సీఎస్ విజ్ఞప్తి చేశారు. నీటి వృథా అరికట్టడంపై 60 రోజుల పాటు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# విద్యతోనే అసమానతలకు చెక్!

**'గురు వందనం'లో డిప్యూటీ సీఎం భట్టి**

**హైదరాబాద్, అక్టోబర్ 13 (ఉద్యమ కెరటం):** విద్య ద్వారానే సామాజిక, ఆర్థిక అసమానతలను అధిగమించవచ్చని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జీ న్యూస్ ఛానల్ నిర్వహించిన 'గురు వందనం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని, సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఈ శాఖను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు డీఎస్సీ ద్వారా భారీగా టీచర్లను, జూనియర్ లెక్చరర్లను నియమించామన్నారు. ప్రభుత్వ బడుల్లో చదివే 27 లక్షల మందికి ఉదయం అల్పాహారంతో పాటు వారానికి మూడు రోజులు పాలు లేదా రాగిజావ ఇస్తున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నామని, వీటిలో టీచర్లకు నివాస సదుపాయాలు కూడా ఉంటాయని వెల్లడించారు. అలాగే ప్రతి నియోజకవర్గానికి ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను మంజూరు చేశామన్నారు.

**నైపుణ్యాభివృద్ధిపై ఫోకస్**

ఉన్నత విద్యారంగంపైనా ప్రత్యేక దృష్టి సారించామని, మహిళా విశ్వవిద్యాలయానికి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టి నిధులు కేటాయిస్తున్నామని భట్టి తెలిపారు. యువతకు ఉపాధి కల్పించేలా ఐటీఐలను ఆధునికీకరిస్తూ, ప్రతి నియోజకవర్గంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ఏర్పాటు చేస్తున్నామన్నారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా



మార్చే లక్ష్య సాధనలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కేకే, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే హరీశ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# జంతర్‌మంతర్ వద్ద మళ్లీ ఉద్రిక్తత!

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్
- బారికేడ్లు దాటి దూసుకెళ్లిన సీజేపీ కార్యకర్తలు
- సౌరవ్ దాస్ సహా పలువురు ముఖ్య నేతల అరెస్ట్
- దేశమంతా జంతర్‌మంతర్ అవుతుందన్న అభిజీత్ దీప్కే



**న్యూ ఢిల్లీ, అక్టోబర్ 13 (ఉద్యమ కెరటం):** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నిలిపివేత డిమాండ్‌తో దేశ రాజధానిలో చేపట్టిన ఆందోళనలు మంగళవారం మరోసారి తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. ఢిల్లీలోని చారిత్రక జంతర్‌మంతర్‌ను అధికారిక నిరసన స్థలాల జాబితా నుంచి తొలగించిన మరుసటి రోజే కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కార్యకర్తలు పోలీసు బారికేడ్లను దాటుకుని లోపలికి చొచ్చుకెళ్లడం కలకలం రేపింది. జాతీయ పతాకాలను చేతబూని జంతర్‌మంతర్ గేట్లు ఎక్కి లోపలికి ప్రవేశించిన సీజేపీ ముఖ్య నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా, అజింక్య షిండే సహా సుమారు 20 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనిపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్రంగా స్పందిస్తూ.. జంతర్‌మంతర్‌ను జాబితా నుంచి తొలగించినంత మాత్రాన ప్రజా నిరసనలను ఆపలేరని, ఇకపై దేశమంతా జంతర్‌మంతర్‌లా మారుతుందని హెచ్చరించారు. మరోవైపు, సీజేపీ నేతల నిర్బంధాన్ని ఖండిస్తూ దిశ విద్యార్థి సంఘం కన్నాట్ ప్లేస్ నుంచి ప్రదర్శన నిర్వహించింది. ఎస్ఐఆర్ ప్రక్రియపై స్వతంత్ర విచారణ కోరుతూ రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే సహా 11 మంది విపక్ష నేతలు దాఖలు చేసిన ఉమ్మడి పిటిషన్‌పై సుప్రీంకోర్టు రిజిస్ట్రీ 14 సాంకేతిక అభ్యంతరాలు వ్యక్తం చేసింది. కోర్టు ఫీజు లోటు, వకాలత్‌నామాలు లేకపోవడం, కొన్ని పత్రాల్లో పేజీలు కనిపించకపోవడం తదితర కారణాలతో ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరగలేదు. లోపాలను సరిదిద్దిన తర్వాతే విచారణకు తీసుకుంటామని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం స్పష్టం చేయడంతో ఎస్ఐఆర్‌పై ఎలాంటి స్టే ఉత్తర్వులు వెలువడలేదు. కాగా, అనుమతి లేకుండా ప్రదర్శన నిర్వహించారంటూ ఇండియా కూటమి ర్యాలీపై ఢిల్లీ పోలీసులు రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

### జర్నలిస్టుల భద్రత.. పోలీసుల మోహరింపు

నిరసనలను కవర్ చేస్తున్న మహిళా జర్నలిస్టులపై పోలీసులు దాడులు చేసి, అక్రమంగా నిర్బంధించారంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఈ అంశంపై వివరణ ఇచ్చేందుకు గురువారం (అక్టోబర్ 15న) ఒక సీనియర్ పోలీసు అధికారి హాజరుకావాలని ఆదేశించింది. మరోవైపు రహదారుల మూసివేత వల్ల రూ. 2,000 కోట్ల మేర వ్యాపార నష్టం వాటిల్లిందని వ్యాపార సంఘాలు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాయి. ఢిల్లీలో నిరసనలు మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉన్నందున, 273 కంపెనీల కేంద్ర సాయుధ బలగాల మోహరింపును అక్టోబర్ 20 వరకు పొడిగించాలని పోలీసులు హోం మంత్రిత్వ శాఖను కోరారు.

# కానిస్టేబుల్ పోస్టుల్లో ఎస్టీ కోటా అమలు చేయాలి!

- ఏజెన్సీల్లో 75 శాతం రిజర్వేషన్లు విస్మరించడం అన్యాయం
- 400 మంది గిరిజన యువకులు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం
- నోటిఫికేషన్‌ను సవరించాలని సీఎంకు విజ్ఞప్తి
- న్యాయం చేయకుంటే పోరాటం తప్పదన్న కవిత



**హైదరాబాద్, అక్టోబర్ 13 (ఉద్యమ కెరటం):** ఏజెన్సీ ప్రాంతాల్లోని కానిస్టేబుల్ ఉద్యోగాల్లో ఎస్టీలకు దక్కాల్సిన 75 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసిన తాజా నోటిఫికేషన్‌లో ఏజెన్సీ ఎస్టీ రిజర్వేషన్లను పూర్తిగా విస్మరించడం కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు చేస్తున్న తీరని అన్యాయమని ఆమె మంగళవారం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా మండిపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1988లో జారీ చేసిన జీవో 109తో పాటు, తెలంగాణ ఏర్పడిన తర్వాత 2018లో విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ 49 ప్రకారం ఏజెన్సీ ఏరియా కానిస్టేబుల్ పోస్టుల్లో ఎస్టీలకు 75 శాతం రిజర్వేషన్లు కల్పించడం చట్టబద్ధమని కవిత గుర్తుచేశారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2015, 2018, 2022 నోటిఫికేషన్లలో ఈ కోటాను యథావిధిగా అమలు చేశారని, కానీ ప్రస్తుత నోటిఫికేషన్‌లో ఈ నిబంధనను తొలగించి గిరిజనుల రాజ్యాంగబద్ధ హక్కులను హరించారని ఆరోపించారు.

### 400 ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం

బోర్డు తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నాగర్‌కర్నూల్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన ఆదివాసీ, గిరిజన యువత తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన నిరుద్యోగులు దాదాపు 400కు పైగా ఉద్యోగాలను కోల్పోవాల్సి వస్తుందన్నారు. హోంమంత్రిగా బాధ్యతలు చూస్తున్న ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి, నోటిఫికేషన్‌లో మార్పులు చేసి 75 శాతం రిజర్వేషన్ నిబంధనను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్టీ యువతతో కలిసి ప్రభుత్వంపై పెద్దఎత్తున పోరాటం చేస్తామని ఆమె హెచ్చరించారు.

# రైతు డిస్కమ్.. అన్నదాత మెడకు ఉరితాడే!

**ఉచిత విద్యుత్‌కు పాతరేసేందుకే సర్కారు కుట్ర**
**రైతులకు నిరంతర విద్యుత్‌పై లిఖితపూర్వక హామీ ఇవ్వాలి**
**నాసిరకం సరుకుల సరఫరా.. గురుకులాల్లో కమీషన్ల దందా**
**పీఎంయూ టెండర్లను రద్దు చేయాలని హరీశ్ రావు డిమాండ్**

**హైదరాబాద్, అక్టోబర్ 13 (ఉద్యమ కెరటం):** అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 'రైతు డిస్కమ్' ఏర్పాటు కోసం జీవో 17 జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతు డిస్కమ్ ఏర్పాటు వ్యవహారం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, దుర్మార్గ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. ఉచిత విద్యుత్‌కు పాతరేసి, రైతుల మెడకు ఉచ్చు బిగించేందుకే ఈ కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు.



### 2 వేల మందితో నిర్వహణ సాధ్యమా?

కొత్త డిస్కమ్ పరిధిలోకి 30 లక్షలకు పైగా వ్యవసాయ కనెక్షన్లు, భగీరథ, లిఫ్ట్ ఇరిగేషన్ కనెక్షన్లను బదిలీ చేశారని, కేవలం రెండు వేల మంది సిబ్బందితో ఇంత భారీ వ్యవస్థ నిర్వహణ ఎలా సాధ్యమవుతుందని హరీశ్ రావు ప్రశ్నించారు. రైతులకు 24 గంటల పాటు ఎలాంటి కోతలు లేకుండా ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇవ్వగలదా? అని నిలదీశారు. రైతు డిస్కమ్‌కు భారీ రుణాలు కేటాయించి ఆర్థిక భారాన్ని రైతులపై పడేయాలని చూస్తున్నారా? అని ప్రశ్నించారు. సంస్థల పేర్లు మార్చడం కాదు.. రైతుల విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

### గురుకులాల్లో కమీషన్ల దందా!

గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లకు నిత్యావసర సరుకుల సరఫరాలో భారీ కుంభకోణం జరుగుతోందని హరీశ్ రావు ఆరోపించారు. స్థానిక వెండర్లను కాదని, రాష్ట్రాన్ని ఒకే యూనిట్‌గా మార్చి రూ.800 కోట్ల టెండర్‌ను బ్లాక్‌లిస్టులో ఉన్న సంస్థకు కట్టబెట్టడం వెనుక భారీ ముడుపులు చేతులు మారాయని విమర్శించారు. అమీర్‌పేటలోని ప్రైవేట్ కార్యాలయం కేంద్రంగా ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి చక్రం తిప్పుతుంటే సీఎం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే మొండివైఖరి వీడి, ఈ కేంద్రీకృత పీఎంయూ టెండర్లను రద్దు చేసి, గతంలోలాగా స్థానిక వెండర్లకే సరఫరా బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.




# మూగజీవాలపై సర్కారు ప్రత్యేక దృష్టి!

**ఎల్నినో ముప్పుతో ముందస్తు అప్రమత్తం**
**చెరువుల శిఖం భూముల్లో పశుగ్రాసం సాగు**
**45 రోజుల్లోగా మేత అందుబాటులోకి..**
**ఉచితంగా సీఎస్‌హెచ్ 24-ఎంఎఫ్ విత్తనాలు**
**పశువుల దాహార్తి తీర్చేలా నీటి తొట్టెలు**

**హైదరాబాద్, అక్టోబర్ 13 (ఉద్యమ కెరటం):** ఎల్నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో.. భవిష్యత్తులో వర్షపాతం తగ్గి పశుగ్రాస కొరత ఏర్పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. పశువులకు అవసరమైన గ్రాసాన్ని ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచడంతో పాటు, మూగజీవాలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. నీటి వసతి ఉన్న చెరువులు, కుంటల శిఖం భూముల్లో పశుగ్రాసం సాగు చేసి 45 రోజుల్లోగా యుద్ధప్రాతిపదికన మేతను అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. మంగళవారం సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో అధికారులు ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో ఐదు నుంచి పది ఎకరాల విస్తీర్ణంలో పశుగ్రాసం సాగు చేయాలని నిర్ణయించారు. ఇందుకు అనువైన శిఖం భూములను గుర్తించే బాధ్యతను నీటిపారుదల, కమాండ్ ఏరియా అభివృద్ధి శాఖకు అప్పగించారు. ఈ సాగుకు అవసరమైన నిధులను ఉపాధి హామీ పథకం నుంచి సమకూర్చనున్నారు. సాగుకు అనువైన, అధిక దిగుబడినిచ్చే 'సీఎస్‌హెచ్ 24-ఎంఎఫ్' రకం పశుగ్రాసం విత్తనాలను పశుసంవర్ధక శాఖ ఉచితంగా అందించనుంది. ఫలితంగా సాగు ప్రారంభానికి అవసరమైన విత్తనాల ఖర్చు రైతులు, సంబంధిత సంఘాలపై పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పశుగ్రాసం సాగు, పంట సంరక్షణ, నీటి నిర్వహణ లాంటి కీలక పనులను పర్యవేక్షించే బాధ్యతను స్వయం సహాయక సంఘాలకు (మహిళా సంఘాలకు) అప్పగించారు.

# కాంగ్రెస్ నిరసనలన్నీ నాటకాలే!

**దేశంలో అరాచకం సృష్టించేందుకు విపక్షాల కుట్ర**
**తీర్పులు అనుకూలంగా రాకపోతే సీజేఐ గద్దె దిగాలా?**
**నిబంధనల ప్రకారమే ఓటర్ల జాబితా సవరణ**
**రేవంత్ రెడ్డిది ద్వంద్వ నీతి: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్, అక్టోబర్ 13 (ఉద్యమ కెరటం):** ఢిల్లీలో వారం రోజులుగా కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు చేస్తున్న నిరసనలన్నీ కేవలం నాటకాలేనని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్, కమ్యూనిస్టులు ప్రజాస్వామ్య హక్కులను దుర్వినియోగం చేస్తూ దేశంలో అరాచకం సృష్టించేందుకు యత్నిస్తున్నాయని మండిపడ్డారు. స్పీకర్, సీఈసీల రాజీనామాలు కోరిన విపక్షాలు, ఇప్పుడు ప్రధాని, హోంమంత్రి, ఆరెస్సెస్ చీఫ్‌లను టార్గెట్ చేశామని చెప్పడం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. తమకు అనుకూలంగా తీర్పులు రాకపోతే ఏకంగా సుప్రీంకోర్టు సీజేఐ గద్దె దిగాలని అనడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా దేశవ్యాప్తంగా చనిపోయిన 2.8 కోట్ల మంది, నివాసం మారిన 6.3 కోట్ల మంది, డూప్లికేట్ ఉన్న కోటి మంది ఓట్లను నిబంధనల ప్రకారమే తొలగించినట్లు కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.



స్థానికంగా తప్పులు సరిదిద్దే అవకాశం కాంగ్రెస్ బీఎల్ఏలకు ఉన్నా వాడుకోకుండా ఢిల్లీలో ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణలో ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వ అధికారులే అన్న విషయాన్ని మర్చిపోవద్దని చురకలంటించారు. తెలంగాణలో బీజేపీ నిరసనలకు అనుమతి ఇవ్వకుండా ముందస్తు అరెస్టులు చేయిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఢిల్లీకి వచ్చి ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని మాట్లాడటం ఆయన ద్వంద్వ నీతికి నిదర్శనమని కిషన్ రెడ్డి విమర్శించారు. ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నాల వల్ల పండుగల సీజన్‌లో చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళలో బోగస్ ఓట్లు తొలగిస్తే మెచ్చుకున్న కాంగ్రెస్, ఇప్పుడెందుకు వ్యతిరేకిస్తోందని నిలదీశారు. బ్యాలెట్ పేపర్ ద్వారా జరిగిన గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, త్రిపుర స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఎందుకు ఓడిపోయిందో సమాధానం చెప్పాలన్నారు. 15 ఏళ్లుగా ప్రజా మద్దతు లేక ఓడిపోతున్న కాంగ్రెస్.. ఇప్పుడు తమ ఓటమికి సీఈసీ, సీజేఐలను బాధ్యులను చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు.

# న్యాయవ్యవస్థపై కాంగ్రెస్ కుట్రలు!

**సుప్రీంకోర్టు వద్ద రాహుల్ తీరును ఖండించిన ఎన్.రామచందర్ రావు**
**హైకోర్టు బార్ కౌన్సిల్ వద్ద న్యాయవాదుల భారీ నిరసన**
**సీజేఐపై కేరళ కాంగ్రెస్ పోస్టులు పెట్టడం సిగ్గుచేటు**
**ఓట్ల తొలగింపుపై అసత్య ప్రచారాలు మానుకోవాలని హెచ్చరిక**
**బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు**



**హైదరాబాద్, అక్టోబర్ 13 (ఉద్యమ కెరటం):** సుప్రీంకోర్టు వద్ద లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ శ్రేణులు ప్రదర్శించిన నాటకీయ వైఖరిని దేశ ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు అన్నారు. భారత న్యాయవ్యవస్థపై ప్రజలకున్న విశ్వాసాన్ని ఉద్దేశపూర్వకంగా దెబ్బతీసేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ఈ వైఖరిని నిరసిస్తూ హైదరాబాద్‌లోని హైకోర్టు బార్ కౌన్సిల్ గేట్ వద్ద న్యాయవాదులు మంగళవారం చేపట్టిన భారీ నిరసన ప్రదర్శనలో ఆయన స్వయంగా ఒక న్యాయవాదిగా పాల్గొన్నారు. సుప్రీంకోర్టు, కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్రపతి వంటి రాజ్యాంగ వ్యవస్థలపై రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ గౌరవం ఉండాలని రామచందర్ రావు హితవు పలికారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల అపాయింట్‌మెంట్ అడిగి రాజకీయ మెమొరాండాలు ఇస్తామనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కోర్టుల్లో పిటిషన్లు ఎలా దాఖలు చేయాలో కూడా కాంగ్రెస్‌లోని సీనియర్ న్యాయవాదులు రాహుల్‌కు చెప్పలేకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మరోవైపు భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను లక్ష్యంగా చేసుకుని కేరళ కాంగ్రెస్ పోస్టులు పెట్టడం, ఆయన రాజీనామా కోరడం న్యాయవ్యవస్థపై సాగిస్తున్న ప్రత్యక్ష దాడి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ఢిల్లీలో మాట్లాడితే, బంగ్లాదేశ్‌లో జమాతే ఇస్లామీ ర్యాలీలు తీయడం వెనుక ఉన్న శక్తులను ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు.

### ఓట్ల తొలగింపుపై అసత్యాలు

'సర్' ద్వారా 13 కోట్ల ఓట్లను అక్రమంగా తొలగించారంటూ కాంగ్రెస్ నేతలు పచ్చి అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని రామచందర్ రావు ధ్వజమెత్తారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన బాధ్యతారాహిత్య వ్యాఖ్యలపై బీజేపీ సవాల్ విసిరిందని, దమ్ముంటే ఆధారాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిబంధనల మేరకే ఎన్నికల సంఘం ఓట్ల సవరణ ప్రక్రియ చేపట్టిందని, ఒక్క ఓటు కూడా చట్టవిరుద్ధంగా తొలగించలేదని స్పష్టం చేశారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎన్.రామచందర్ రావు బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగన్మాత ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో వర్ధిల్లాలని, రైతుల పంటలు సమృద్ధిగా పండి రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ ఆయన శరన్నవరాత్రుల శుభాకాంక్షలు తెలిపారు.



# సీఈసీ రాజీనామా చేయకుంటే అభిశంసన తప్పదు

**ఎంపీ శశిథరూర్ హెచ్చరిక!**

**ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు జరిగాయని ఆరోపణ**

**తొలగించిన అర్హుల ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (ఉద్యమ కెరటం):** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తీరుపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ తీవ్ర విమర్శలు చేశారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ప్రతిపక్షాలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని నిలబెట్టాల్సిన ప్రధాన ఎన్నికల కమిషనర్ ప్రతిపక్షాల నమ్మకాన్ని కోల్పోయారని ఆరోపించారు. జ్ఞానేశ్ కుమార్ నైతిక బాధ్యత వహించి స్వచ్ఛందంగా పదవి నుంచి తప్పుకోవాలని, లేకుంటే ఆయన తొలగింపునకు రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ చేపట్టేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయని ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నట్లు కథనాలు వెల్లడించాయి. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని శశిథరూర్ ఆరోపించారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వివాదాస్పద సవరణ ప్రక్రియను నిలిపివేసి, అన్యాయంగా తొలగించినట్లు నిర్ధారణ అయిన ఓటర్ల పేర్లను తిరిగి జాబితాల్లో చేర్చాలని కోరారు. ఓటర్ల వివరాల పరిశీలనకు ఉపయోగించిన సాఫ్ట్‌వేర్, సాంకేతిక విధానాలను స్వతంత్రంగా సమీక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్లకు కల్పించిన చట్టపరమైన రక్షణలను ప్రస్తావిస్తూ 2023లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టంపై శశిథరూర్ విమర్శలు చేసినట్లు కథనాలు పేర్కొన్నాయి. ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్ల నేపథ్యంలో ఆ చట్టం ఆమోదం పొందిన తీరును ఆయన ప్రశ్నించినట్లు సమాచారం. ఎన్నికల సంఘం స్వతంత్రత, జవాబుదారీతనం ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకమని అభిప్రాయపడ్డారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవిలో కొనసాగుతున్న వ్యక్తిపై ప్రజల విశ్వాసం నిలవడం అత్యవసరమని శశిథరూర్ పేర్కొన్నట్లు సమాచారం. జ్ఞానేశ్ కుమార్ స్వచ్ఛందంగా రాజీనామా చేయకపోతే ఆయన తొలగింపునకు పార్లమెంటులో తీర్మానం తీసుకొచ్చే అంశాన్ని ప్రతిపక్షాలు పరిశీలిస్తున్నాయని తెలిపారు. రాజ్యాంగంలోని 324వ అధికరణం ప్రకారం ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తి తొలగింపునకు వర్తించే విధానంలోనే పదవి నుంచి తొలగించవచ్చు. అయితే ఓటర్ల జాబితాల్లో అక్రమాలు జరిగాయనే అంశాలు శశిథరూర్ చేసిన ఆరోపణలుగానే ఉన్నాయి. వాటిపై ఎన్నికల సంఘం అధికారిక వివరణ, సంబంధిత ఆధారాల పరిశీలన అవసరం. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు రాజ్యాంగపరమైన పదవీ రక్షణ లేదనే వాదన కూడా సరైనది కాదు. ఆయన తొలగింపునకు రాజ్యాంగంలో ప్రత్యేక ప్రక్రియ ఉంది.

# వాదిస్తే నిజాలు అబద్ధాలు కావు..

**లద్దాఖ్‌పై చైనాకు భారత్ కౌంటర్**

**లద్దాఖ్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే**

**గతంలో మనదే.. ఇప్పుడూ మనదే.. భవిష్యత్తులోనూ మనదే**

**చైనా అభ్యంతరాలను తోసిపుచ్చిన విదేశాంగ శాఖ**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (ఉద్యమ కెరటం):** కేంద్రపాలిత ప్రాంతమైన లద్దాఖ్ విషయంలో చైనా చేసిన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. లద్దాఖ్ ఎప్పటికీ భారతదేశంలో అంతర్భాగమేనని, ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. లద్దాఖ్‌ను భారత్‌లో భాగంగా గుర్తించబోమంటూ చైనా వ్యక్తం చేసిన అభ్యంతరాలకు మంగళవారం మీడియా సమావేశంలో ఆయన సమాధానమిచ్చారు. చైనా ఎంతగా వాదించినా చారిత్రక, భౌగోళిక వాస్తవాలు మారిపోవని తేల్చిచెప్పారు. లద్దాఖ్ భారతదేశంలో అంతర్భాగమనే విషయంలో ఎలాంటి సందేహాలకు తావులేదని రణ్‌ధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. గతంలోనూ లద్దాఖ్ భారత్‌లో భాగంగానే ఉందని, ప్రస్తుతం కూడా అలాగే ఉందని, భవిష్యత్తులోనూ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంపై భారతదేశ వైఖరి సుస్పష్టంగా ఉందని చెప్పారు. చైనా అభ్యంతరాలు వ్యక్తం చేసినంత మాత్రాన వాస్తవాలు మారిపోవని వ్యాఖ్యానించారు. లద్దాఖ్ ప్రాంతంలోని 28 భౌగోళిక ప్రదేశాలను గుర్తిస్తూ కేంద్ర హోం శాఖ అక్టోబర్ 2న కొత్త మ్యాప్‌ను విడుదల చేసినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఈ చర్యపై చైనా అభ్యంతరం వ్యక్తం చేసింది. లద్దాఖ్‌ను భారతదేశంలో అంతర్భాగంగా తాము గుర్తించలేదని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ ప్రకటించారు. వివాదాస్పద ప్రాంతాల్లో భౌగోళిక ప్రదేశాలను గుర్తించడం చట్టవిరుద్ధమని చైనా వాదించారు. ఆ ప్రాంతంలోని కొన్ని భూభాగాలపై తమకూ హక్కులున్నాయని పేర్కొన్నారు. కేంద్ర హోం శాఖ గుర్తించినట్లు పేర్కొన్న 28 భౌగోళిక ప్రదేశాల్లో పది పర్వత శిఖరాలు, రెండు కనుమలు, మూడు పర్వతాలు, ఏడు భూభాగాలు, రెండు హిమానీనదాలు, రెండు జలవనరులు, ఒక లోయ, ఒక నది ఉన్నాయి. ఈ ప్రాంతాల గుర్తింపును చైనా ప్రశ్నించడంతో ఇరుదేశాల మధ్య సరిహద్దు అంశం మరోసారి చర్చనీయాంశమైంది. లద్దాఖ్ విషయంలో చైనా వాదనలను అంగీకరించే ప్రసక్తే లేదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. కేంద్రపాలిత ప్రాంతం లద్దాఖ్ భారతదేశంలో అంతర్భాగమనే అధికారిక వైఖరిని పునరుద్ఘాటించింది. సరిహద్దు వివాదాల నేపథ్యంలో ఇరుదేశాలు తమ తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్నప్పటికీ లద్దాఖ్‌పై భారతదేశ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని రణ్‌ధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.

# అధికారం అజమాయిషీకి కాదు.. ప్రజల సాధికారతకే!





- ప్రజలను నియంత్రించడం కాదు.. అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- సాంకేతికత, సమాచారం, ఆవిష్కరణల ఫలాలు అందరికీ అందాలి
- పోటీ కంటే సహకారానికి ప్రాధాన్యం ఇవ్వాలి
- భారత ఆర్థిక వ్యవస్థ బలమైన పునాదులపై నిలిచిందన్న ప్రధాని
- తొలి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి నమోదైందని వెల్లడి
- పదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని ప్రకటన

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (ఉద్యమ కెరటం):** అధికారం ప్రజలపై అజమాయిషీ చెలాయించడానికి కాదని, వారికి కొత్త అవకాశాలు కల్పించి సాధికారత దిశగా నడిపించేందుకు ఉపయోగపడాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ప్రభుత్వాలు ప్రజలను తమపై ఆధారపడేలా చేయకుండా స్వశక్తితో ఎదిగే అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. సాంకేతికత, సమాచారం, విజ్ఞానం, ఆవిష్కరణలు నేటి ప్రపంచంలో అత్యంత కీలక శక్తులుగా మారాయని, వాటి ప్రయోజనాలు కొద్దిమందికే పరిమితం కాకుండా కోట్లాది మందికి అందాలని పిలుపునిచ్చారు. మంగళవారం బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో ప్రసంగించిన మోదీ ప్రపంచ దేశాలు పోటీకి బదులుగా సహకారానికి, నియంత్రణకు బదులుగా ప్రజల సాధికారతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ బలమైన పునాదులపై నిలిచి ఉందని ప్రధాని పేర్కొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో దేశ స్థూల దేశీయోత్పత్తి వృద్ధి 7.8 శాతంగా నమోదైందని తెలిపారు. ఆర్థిక సంస్కరణలు, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం దేశ అభివృద్ధికి దోహదపడుతున్నాయని వివరించారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని మోదీ తెలిపారు. 2014లో దేశ పునరుత్పాదక ఇంధన సామర్థ్యం సుమారు 75 గిగావాట్లు ఉండగా ప్రస్తుతం 300 గిగావాట్లకు చేరుకుందని పేర్కొన్నారు. స్వచ్ఛ ఇంధన వినియోగం పర్యావరణ పరిరక్షణతోపాటు కొత్త పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు మార్గం సుగమం చేస్తోందని చెప్పారు. హరిత ఇంధన రంగం భవిష్యత్తు ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు. భారత్ ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లుగా నిలిచిందని ప్రధాని అభివర్ణించారు. దేశంలో వందకు పైగా భాషలు, సుమారు 80 వేల వార్తాపత్రికలు, ప్రచురణలు, వెయ్యికి పైగా ఉపగ్రహ టెలివిజన్ ఛానళ్లు ఉన్నాయని తెలిపారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో 50 కోట్ల మందికి పైగా భారతీయులు చురుగ్గా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. విభిన్న అభిప్రాయాలను వ్యక్తీకరించడానికి, ప్రజల మధ్య చర్చలు జరగడానికి డిజిటల్ సాంకేతికత విస్తృత అవకాశాలు కల్పిస్తోందన్నారు.

గత పదేళ్లలో దేశంలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ సంఖ్య ప్రపంచంలోని అనేక దేశాల మొత్తం జనాభా కంటే ఎక్కువని పేర్కొన్నారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ప్రభుత్వ విధానాల ప్రధాన ఉద్దేశమని వివరించారు. అధికారాన్ని ప్రజలను నియంత్రించే సాధనంగా కాకుండా వారి సామర్థ్యాలను పెంపొందించే శక్తిగా ఉపయోగించాలని స్పష్టం చేశారు. సాంకేతికత, విజ్ఞానం, ఆవిష్కరణల ప్రయోజనాలను అందరికీ అందుబాటులోకి తీసుకురావడం ద్వారానే సమ్మిళిత అభివృద్ధి సాధ్యమవుతుందని మోదీ పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు పరస్పర సహకారంతో ముందుకు సాగితే కొత్త ఆర్థిక అవకాశాలను సృష్టించవచ్చని అభిప్రాయపడ్డారు.

# ప్రజాస్వామ్య రక్షణకు కలిసికట్టుగా పోరాడుతాం

- ఇండియా కూటమి భేటీలో రాహుల్ గాంధీ పిలుపు!
- రాహుల్ నివాసంలో ఇండియా కూటమి నేతల కీలక భేటీ
- ఓటర్ల జాబితాల సవరణ, ఓట్ల తొలగింపుపై చర్చ
- మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్‌పై రాహుల్ తీవ్ర విమర్శలు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (ఉద్యమ కెరటం):** దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలన్నీ కలిసికట్టుగా పోరాడతాయని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ప్రజల నిరసన తెలిపే హక్కును అణచివేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. మంగళవారం ఢిల్లీలోని రాహుల్ గాంధీ నివాసంలో ఇండియా కూటమి నేతలు సమావేశమయ్యారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ, ఓట్ల తొలగింపుపై వస్తున్న ఆరోపణలు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్ తదితర అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో కలిసి రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. ప్రజలు తమ అభిప్రాయాలను, నిరసనలను ప్రజాస్వామ్యబద్ధంగా వ్యక్తం చేసేందుకు జంతర్ మంతర్ ప్రధాన వేదికగా నిలిచిందని రాహుల్ పేర్కొన్నారు. ఇటీవల అక్కడ నిర్వహించిన నిరసన కార్యక్రమాలు విజయవంతమయ్యాయని తెలిపారు. అయితే ప్రజల నిరసన గళాన్ని అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆ వేదికపై ఆంక్షలు విధించిందని ఆరోపించారు. జంతర్ మంతర్‌లో నిరసన ప్రదర్శనలపై నిషేధం విధించాలనే నిర్ణయాన్ని సవాలు చేస్తామని ప్రకటించారు. ప్రజల నిరసన తెలిపే హక్కును కేంద్ర ప్రభుత్వం అంత సులభంగా కాలరాయలేదని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌లపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. జంతర్ మంతర్‌లో నిరసనలపై ఆంక్షల వెనుక ఈ ముగ్గురి పాత్ర ఉందని ఆరోపించారు. రాజ్యాంగ వ్యవస్థలను దెబ్బతీసి బాధ్యతల నుంచి తప్పించుకోవడం సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరిచే ప్రయత్నాలపై రాజకీయంగానూ, చట్టపరంగానూ పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై ఇండియా కూటమి నేతలు సమావేశంలో చర్చించారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించారనే అంశాన్ని తీవ్రంగా పరిగణించాలని అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలిచేలా ఎన్నికల సంఘం వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా అంశంపైనా నేతలు చర్చించినట్లు వెల్లడించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం దెబ్బతీస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ప్రతిపక్షాలు ఐక్యంగా నిలబడతాయని చెప్పారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడేందుకు అన్ని ప్రజాస్వామ్య మార్గాల్లో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ప్రకటించారు. అయితే ఓటర్ల జాబితాల్లో అవకతవకలు, నిరసనలపై ఆంక్షల వెనుక వ్యక్తుల పాత్రకు సంబంధించి రాహుల్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ ఆరోపణలుగా ఉన్నాయి. వీటిపై కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం అధికారిక స్పందనను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది.

# నీట్ పేపర్ లీకేజీలకు ఇక చెక్ పడాల్సిందే!

- ఒకే ప్రశ్నపత్రం విధానానికి స్వస్తి పలకాలి
- పరీక్ష ప్రారంభానికి నిమిషాల ముందే ప్రశ్నపత్రం సిద్ధం చేయాలి
- భారీ ప్రశ్నల నిధితో అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చు
- కాగితం పరీక్షలకు బదులు కంప్యూటర్ ఆధారిత విధానం
- దేశవ్యాప్తంగా లక్షన్నర పరీక్షా కేంద్రాలు అవసరం
- పరీక్షల వ్యవస్థలో సమూల మార్పులకు నందన్ నిలేకని సూచనలు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (ఉద్యమ కెరటం):** దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే నీట్ వంటి ప్రవేశ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలకు శాశ్వత పరిష్కారం చూపాలంటే పరీక్షల నిర్వహణ విధానంలో సమూల మార్పులు తీసుకురావాలని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నిలేకని సూచించారు. ముందుగానే ఒకే ప్రశ్నపత్రాన్ని రూపొందించి ముద్రించే విధానం వల్ల దానిని అక్రమంగా సంపాదించి విక్రయించే అవకాశాలు ఏర్పడుతున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రశ్నపత్రాల లీకేజీ జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే అసలు లీకేజీకి అవకాశం లేకుండా పరీక్షా వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రవేశ పరీక్షల కోసం ముందుగానే ఒకే ప్రశ్నపత్రాన్ని సిద్ధం చేసి భద్రపరిచే విధానాన్ని నందన్ నిలేకని ప్రశ్నించారు. ప్రశ్నపత్రం ముందుగానే అందుబాటులో ఉండటం వల్ల దానిని లీక్ చేసి విక్రయించే అక్రమ దందాలకు అవకాశం కలుగుతోందని పేర్కొన్నారు. పరీక్షల విశ్వసనీయతను కాపాడాలంటే ప్రశ్నపత్రాల రూపకల్పన నుంచి పరీక్ష నిర్వహణ వరకు ఆధునిక సాంకేతికతను వినియోగించాలని సూచించారు. ప్రవేశ పరీక్షలకు భారీ సంఖ్యలో ప్రశ్నలతో కూడిన ప్రశ్నల నిధిని రూపొందించాలని నిలేకని ప్రతిపాదించారు. పరీక్ష ప్రారంభానికి కొన్ని నిమిషాల ముందు మాత్రమే ఆ ప్రశ్నల నుంచి స్వయంచాలక విధానంలో ప్రశ్నపత్రాన్ని సిద్ధం చేయాలని సూచించారు. దీనివల్ల ముందుగానే ప్రశ్నపత్రాన్ని సంపాదించి విక్రయించే అవకాశాలు తగ్గుతాయని వివరించారు. ప్రశ్నపత్రాల లీకేజీల ద్వారా అక్రమంగా డబ్బు సంపాదించే వ్యవస్థకు ఈ విధానం అడ్డుకట్ట వేయగలదని అభిప్రాయపడ్డారు. సంప్రదాయ కాగితం ఆధారిత పరీక్షల నుంచి కంప్యూటర్ ఆధారిత పరీక్షల వైపు మారాల్సిన అవసరం ఉందని నందన్ నిలేకని పేర్కొన్నారు. డిజిటల్ విధానంలో ప్రశ్నపత్రాల తయారీ, పంపిణీ, పరీక్షల నిర్వహణను మరింత సమర్థంగా చేపట్టవచ్చని వివరించారు. అయితే దేశవ్యాప్తంగా విద్యార్థులందరికీ సమాన అవకాశాలు కల్పించేలా అవసరమైన సాంకేతిక మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని సూచించారు. కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్షలను విస్తృత స్థాయిలో నిర్వహించేందుకు దేశవ్యాప్తంగా కనీసం లక్షన్నర పరీక్షా కేంద్రాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని నిలేకని ప్రతిపాదించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థులు పరీక్షలు రాసేందుకు దూరప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కేంద్రాల వ్యవస్థను విస్తరించాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో భద్రతతోపాటు విద్యార్థులకు అందుబాటు కూడా ముఖ్యమని పేర్కొన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీలు జరిగిన ప్రతిసారీ విచారణలు, అరెస్టులతో సరిపెట్టకుండా పరీక్షా వ్యవస్థలోనే లోపాలను సరిదిద్దాలని నందన్ నిలేకని అభిప్రాయపడ్డారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తగిన నిర్ణయాలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణలో మార్పుల అమలుపై ప్రధానమంత్రి కూడా ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో విశ్వాసం పెరగాలంటే పారదర్శకత, భద్రత, సమాన అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని నిలేకని సూచనలు స్పష్టం చేస్తున్నాయి. అయితే ఆయన ప్రతిపాదించిన విధానాలు అమల్లోకి రావాలంటే ప్రశ్నల నిధి భద్రత, సాంకేతిక సామర్థ్యం, పరీక్షా కేంద్రాల సిద్ధత వంటి అంశాలపై సమగ్ర పరిశీలన అవసరం. ఈ ప్రతిపాదనలపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



# పూలనే దేవతగా పూజించే పండుగ 'బతుకమ్మ'

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. శారదాదేవి

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ప్రకృతిలో లభించే పూలను బతుకమ్మగా పేర్చి దేవతగా పూజించే తెలంగాణ సంస్కృతి వైభవోపేతమైనదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. శారదాదేవి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలకు జిల్లా కలెక్టర్ కె.హరిత, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ అనంతలక్ష్మి, ఎస్పీ నితికా పంత్, జిల్లా అటవీ అధికారి బాలమణితో కలిసి హాజరై బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకమైన సాంస్కృతిక వైభవాన్ని అందిస్తుందని తెలిపారు. ప్రకృతిలో సహజంగా లభించే వివిధ రకాల రంగురంగుల పూలను సేకరించి, బతుకమ్మగా పేర్చి, దేవతా స్వరూపంగా భావించి పూజించే విశిష్టమైన సంప్రదాయం తెలంగాణలో ప్రత్యేకంగా కొనసాగుతోందని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ మనిషి జీవితం ప్రకృతితో మమేకమై ఉంటుందని బతుకమ్మ పండుగ చెబుతుందని, తెలంగాణ ప్రజల జీవన విధానానికి, ప్రకృతితో ఉన్న అనుబంధానికి ఈ పండుగ ప్రతిబింబమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు, ప్రకృతి పట్ల గౌరవభావానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. బతుకమ్మ పండుగ ద్వారా మన సంస్కృతిని భావితరాలకు అందించడంతో పాటు, మన ప్రాంతీయ సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.













## స్వచ్ఛ కార్మికులకు దసరా కిట్ల పంపిణీ

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు దసరా కిట్లను మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్ కమిషనర్ అంజయ్య , కౌన్సిలర్లతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దసరా పండుగ నేపథ్యంలో కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని నేపథ్యంలో వారికి కొత్త బట్టలతోపాటు, వివిధ రకాల రోజువారి వస్తువులతో కలిసి ప్రత్యేక కిట్ అందిస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిశుభ్రతలో వారి పాత్ర ఎంతో ఉందన్నారు. అటువంటి వారికి అండగా ఉంటామన్నారు. పండగ సందర్భంగా కార్మికుల కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు చిలువేరు వెంకన్న, రాపర్తి కార్తీక్, జాడి వినోద్, సలాం, బాలకృష్ణ , డీఈ రమాదేవి, మున్సిపల్ మేనేజర్ సర్వర్, నాయకులు సాయిశ్రావణ్, దూడల అశోక్, కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడే జల్సా-ఏ-గౌస్-ఇ-అజమ్

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జామా మస్జిద్ వద్ద ఈనెల 14వ తేదీన బుధవారం రోజున నిర్వహించనున్న 'జల్సా-ఏ-గౌస్-ఇ-అజమ్' కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను మంగళవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ముస్లిం సోదరులు, సోదరీమణులు అధిక సంఖ్యలో



తరలివచ్చి జల్సాను విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి 7:00 గంటలకు ఈ జల్సా కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ ఆధ్యాత్మిక సభకు ముఖ్య అతిథిగా ప్రముఖులు హజరత్ అహ్మద్ నక్షబంది విచ్చేస్తున్నట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్, జామా మస్జిద్ అధ్యక్షులు అబ్దుల్ ఫయాజ్, నిర్వాహకులు షేక్ షాకీర్, షేక్ షబ్బీర్, సాలం బీన్ హసన్, ఎండీ సాజిద్, అబ్దుల్ సలాం, చోటన్, అమర్ బీన్ హసన్, జాఫర్ సాదిక్ హుస్సేన్, ఎండీ తాజ్, సమీ, అబ్దుల్ ముబాషీర్, అహ్మద్ , అజ్మీర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పత్తి కొనుగోలు కొరకు ఏర్పాట్లు సిద్ధం చేయాలని కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి మార్కెటింగ్, రవాణా, విద్యుత్, వ్యవసాయ, అగ్నిమాపక, తూనికలు కొలతలు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, సీసీఐ అధికారులతో కొనుగోలు ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2026-27 సీజన్ పత్తి కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లాలో 3 లక్షల 77 వేల ఎకరాలలో పత్తి సాగు జరిగిందని, 26 లక్షల 44 వేల క్వింటాళ్ల పత్తి పంట దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పత్తి మద్దతు ధర 8 వేల 667 రూపాయలుగా ప్రకటించిందని తెలిపారు. ఆయా జిన్నింగ్ మిల్లుల యజమానులు మిల్లులలో రక్షణ చర్యలు చేపట్టాలని, విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని, అగ్నిమాపక శాఖ అధికారులు మిల్లులను సందర్శించి రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. తూనికలు కొలతల శాఖ అధికారులు తూకం యంత్రాలను తనిఖీ చేసి స్పష్టమైన నివేదికలు సమర్పించాలని తెలిపారు. రైతులు కిసాన్ కపాస్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని పత్తిని విక్రయిస్తారని, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఏ.డి. అశ్వక్ అహ్మద్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, విద్యుత్ శాఖ ఎస్.ఈ. ఉత్తమ్ జాడే, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## జనాభా గణన అంశాలపై అవగాహన కలిగి ఉండాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** జనాభా గణన ఫేజ్2లో భాగంగా కార్యక్రమ నిర్వహణలో ప్రతి అంశంపై అవగా హన కలిగి ఉండాలని కలెక్టర్ హరిత అన్నారు. మంగళ వారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవ న సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి గురవయ్య లతో కలిసి జనాభా గణన ఫేజ్ 2 లో భాగంగా జిల్లా, డివిజన్ స్థాయి చార్జ్ అధికారులకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనాభా గణన ప్రక్రియలు ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లు చెప్పిన ప్రతి అంశాన్ని తెలుసుకోవాలని, మొదటి విడత ఇండ్ల గణన కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో 2వ విడత లో చేపట్టే జన గణన కార్యక్రమాన్ని సమన్వయంతో పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ ఉషన్న, జిల్లా యువజన క్రీడ సేవల అధికారి వెంకటేశ్వర్, చార్జ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాము కాటుతో మహిళ మృతి



**ఉద్యమ కెరటం, సత్తు పల్లి :** ఖమ్మం జిల్లా తల్లాడ మండల పరిధిలోని తెలగవరంలో మంగళవారం విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తేల్లూరి వాణి (30) ఉదయం పత్తి తీసేందుకు పొలానికి వెళ్లగా, పాము కాటుకు గురై మృతిచెందింది. పాము కాటుకు గురైన వాణిని కుటుంబ సభ్యులు కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వాణికి భర్త వెంకన్నతో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆమె మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# జిల్లా కాంగ్రెస్ వైస్ చైర్మన్ కు సన్మానం



**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ వైస్ చైర్మన్గా నియమితులైన మహమ్మద్ ముస్తఫా, ఇచ్చోడ మండల మైనార్టీ చైర్మన్గా ఎన్నికైన షేక్ అక్బిల్ లను ఇచ్చోడ మైనార్టీ నాయకులు రసూల్ ఖాన్ శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైస్ చైర్మన్ మహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన పార్టీ అధిష్టానానికి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి శ్రేణులను సమన్వయం చేసుకుంటూ శ్రమిస్తానని పేర్కొన్నారు. మైనార్టీల సంక్షేమం కోసం నిరంతరం అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ శంషొద్దీన్, ఇచ్చోడ మండల అధికార ప్రతినిధి బొజ్జ రవి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ షేక్ మజార్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ కదం శివాజీ, ఫెరోస్ ఖాన్, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాదారం లో తీరనున్న నీటి కష్టాలు



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని మాదారం గ్రామంలో ఎన్నో రోజుల నుంచి ఉన్న నీటి కష్టాలు తీరనున్నాయి. మాదారంలో ఉన్న నీటి సమస్యల గురించి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి బెల్ల oపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే వెంటనే స్పందించి డిఎంఎఫ్టి నిధులతో రూ.5లక్షలు మంజూరు చేయించి బోరు వేయించారు. మూడు నెలల క్రితం వేసిన బోరుకు మోటర్ ను బిగించి మంగళవారం లాంఛనంగా పూజా కార్యక్రమం నిర్వహించి జిల్లా ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ ఎన్నో రోజులుగా మాదారం గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న నీటి కష్టాలు తీరాయన్నారు. సుదీర్ఘ కాలంగా గ్రామ ప్రజలు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా వేసవి కాలంలో సమస్య మరింత తీవ్రంగా ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం గ్రామానికి సరఫరా అయ్యే మిషన్ భగీరథ నీరు గ్రామ ప్రజలకు పూర్తి స్థాయిలో సరిపోకపోవడంతో నీటి సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. నూతన బోర్ వేల్ ను మంజూరు చేసి నీటి కష్టాలు తీర్చిన ఎమ్మెల్యే గడ్డం వినోద్, అహర్నిశలు కష్టపడిన జిల్లా ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డిలకు గ్రామపంచాయతీ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డు సభ్యులు గొర్ల పల్లి భానేష్, గోదెల లక్ష్మి, మీస లలిత, కత్తెర్ల రవికుమార్, పొట్లం చెర్ల సౌమ్య, గుండేటి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీవాణి, కాంగ్రెస్ నాయకులు పుట్ట శ్రీనివాస్, తోట శ్రీనివాస్, మీస శంకర్, ఆసంపల్లి శ్రీనివాస్, సిపిఐ నాయకులు సముద్రాల ఆనంద్, సిరికొండ సత్యనారాయణ, బొడ్డు సతీష్, రేషన్ డీలర్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# హత్యకు గురైన యువకుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూడల స్వామి మాదిగ



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** హత్యకు గురైన దళిత యువకుడు నాతరి సతీష్ కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూడల స్వామి మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారికి ధైర్యం చెప్పి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరడిగొండ మండలం బుగ్గారం గ్రామానికి చెందిన నాతరి సతీష్ను జూన్ 17న కొందరు యువకులు కుల వివక్షతో పతకం ప్రకారం తీసుకెళ్లి హత్య చేసి, బోథ్ కరత్వాడ ప్రాజెక్టులో పడేశారని తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులపై హత్య, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం, చీటింగ్ తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటన జరిగి సుమారు నాలుగు నెలలు గడుస్తున్నా బాధిత కుటుంబానికి చట్టపరంగా అందాల్సిన సహాయం అందకపోవడం బాధాకరమన్నారు. భర్తను కోల్పోయిన తల్లి కి ఇద్దరు కుమార్తెలు ఉండగా, చేతికి అందివచ్చిన కొడుకు హత్యకు గురికావడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి చట్ట ప్రకారం అందాల్సిన పరిహారం, పునరావాసం, విద్య, ఉపాధి సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై స్పందించడంలో నిర్ల క్ష్యం వహించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఎమ్మార్పీఎస్ అండగా నిలుస్తుందని, అవసరమైతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాదిగ, రాష్ట్ర నాయకులు గజ్జల శంకర్ మాదిగ, కారెం రవి మాదిగ, సంతోష్ మాదిగ, రోడ్డు గంగన్న, అశోక్, సారంగ రవి తదితరులు ఉన్నారు.

# లక్ష్యాన్ని సాధించే వరకు నిరంతరం శ్రమించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పక్క ప్రణాళికలతో లక్ష్యాన్ని సాధించే వరకు నిరంతరం శ్రమించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్లో మంగళవారం ఎస్సై, కానిస్టేబుల్ శిక్షణ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఐఎఫ్పి ప్యానెల్, వాటర్ ప్లాంట్ల ను ప్రారంభించారు. అనంతరం స్టడీ సర్కిల్ శిక్షణతో కానిస్టేబుల్ ఉద్యోగం పొందిన అభ్యర్థి ఉమ భారతిని శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సై, కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షను ప్రతిఒక్కరూ సాధించేడంతో పాటు, ఫిజికల్ ఈవెంట్స్పై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. పోలీసు శాఖ సహకారంతో మంచి శిక్షణ పొందాలని, కేవలం ఎక్కువ కంటెంట్ చదవడం కంటే లిమిటెడ్ కంటెంట్ను పదే పదే రివిజన్ చేయడం, ప్రీవియస్ ఇయర్ మోడల్ క్వశ్చన్ పేపర్లను ప్రాక్టీస్ చేయడం ద్వారానే విజయం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. జిల్లా యంత్రాంగం తరపున అవసరమైన అన్ని సదుపాయాలను కల్పిస్తున్నామని, ప్రతిఒక్కరు విజేతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సోనియా, బీసీ, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్లు ప్రవీణ్, రమేష్, అధ్యాపకులు, అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్హెచ్ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె ప్రారంభం

**న్యాయం చేయాలంటూ ఆందోళన**




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్హెచ్ఎం) కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం నుంచి నిరవధిక సమ్మెకు కూర్చున్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రజారోగ్య సేవల్లో కీలకపాత్ర పోషిస్తున్న తమను ప్రభుత్వం తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. ఈ సందర్భంగా సమ్మె శిబిరంలో కూర్చున్న నాయకులు మాట్లా డుతూ ప్రాణాలకు తెగించి కరోనా వంటి విపత్కర సమయాల్లోనూ సేవలందించిన తమకు ఉద్యోగ, ఆరోగ్య భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఎన్హెచ్ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తున్నా, మన రాష్ట్రంలో మాత్రం ప్రభుత్వం నిర్ల క్ష్యం వహిస్తోందని మండిపడ్డారు.

**ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు ..**

ఎన్హెచ్ఎం పరిధిలోని కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేయాలని, నిబంధనల ప్రకారం రావాల్సిన 5శాతం వార్షిక ఇంక్రిమెంట్, 8శాతం రాయల్టీ బోనస్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం, పూర్తి స్థాయి ఉద్యోగ భద్రత కల్పించాలని, రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 15,230 మంది, ఒక్క ఆదిలాబాద్ జిల్లా లోనే 478 మంది ఉద్యోగులు విధులను బహిష్కరించి ఈ సమ్మెలో పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నడుస్తున్న ఈ మిషన్లో రూ. 12వేల నుంచి రూ. 40వేల లోపు అల్ప జీతాలతో దాదాపు 20 ఏళ్లుగా దుర్భర పరిస్థితుల్లో పని చేస్తున్నామని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేసే వరకు ఈ సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు దేవీదాస్ జాదవ్, శ్రావణ్, గీతేష్, రమణ, శివప్రసాద్, శ్రీకాంత్, ప్రశాంత్ దత్, అనిల్, రవి, చిన్నిదేవి, ప్రసాద్, అమర్నాథ్, సురేందర్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# వాడగూడలో రైతు శిక్షణ కార్యక్రమం

- ప్రస్తు త పంటల యాజమాన్యం, రబీ సాగుపై అవగాహన



**ఉద్యమ కెరటం, బేల:** మండల పరిధిలోని బాది గ్రామ పంచాయతీకి చెందిన వాడగూడ గ్రామంలో మంగళవారం రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ జిల్లా వ్యవసాయ సంచాలకులు శ్రీధర్, కేవీకే శాస్త్రవేత్త మోహన్ దాస్ ముఖ్య అతిథులుగా హాజరై రైతులకు ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, పంటల సాగుపై కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ సంచాలకులు శ్రీధర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పత్తి పంటలో రైతులు చేపట్టాల్సిన వివిధ రకాల యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ముఖ్యంగా తెగుళ్లు, కీటకాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. అలాగే రాబోయే రబీ సీజన్ సాగుకు సంబంధించి రైతులు ఎలాంటి పంటలను ఎంపిక చేసుకోవాలో దిశానిర్దేశం చేశారు. కేవీకే శాస్త్రవేత్త శ్రీ మోహన్ దాస్ మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంపై ఎల్ నినో ప్రభావం చూపే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తక్కువ నీటితో, సకాలంలో చేతికి వచ్చే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలన్నారు. శాఖ ద్వారా అందుతున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాది గ్రామ సర్పంచ్ దంతెల వినోద్, ఉప సర్పంచ్ జుగ్నాక శంకర్, గ్రామ పటేల్, స్థానిక వ్యవసాయ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి



**ఉద్యమ కెరటం, సత్తు పల్లి :** ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పిలుపునిచ్చారు. మంగళవారం సత్తుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సత్తుపల్లి పట్టణ, మండలంతో పాటు వేంసూరు మండల బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి ప్రతిఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కరోనా సమయంలో ప్రైవేట్ ఉపాధ్యాయులను ఆదుకున్న ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రుల్లో అసంతృప్తి నెలకొందని, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎల్నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని, కరువు మండలాల ప్రకటనతో పాటు ఉపాధి హామీ పనిదినాల పెంపుపై ఇచ్చిన హామీలను అమలు చేసి రైతులు, గ్రామీణ ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బొగ్గు ఉత్పత్తి జరుగుతున్నప్పటికీ కేటీపీఎస్, మణుగూరు థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి నిర్వహణపై ప్రభుత్వం నిర్ల క్ష్యం వహిస్తోందని ఆరోపించారు. సింగరేణి బొగ్గు వ్యవహారంపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. పట్టభద్రులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు బీఆర్ఎస్ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.



# ఐసీసీ అవార్డుల్లో గిల్, షఫాలీ వర్మకు గుర్తింపు

**దుబాయ్, అక్టోబరు 13 (ఉద్యమ కెరటం):** భారత క్రికెటర్లు శుభ్‌మన్ గిల్, షఫాలీ వర్మ తమ అద్భుత ప్రదర్శనలతో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నుంచి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఐసీసీ నెలవారీ ఉత్తమ ఆటగాళ్ల పురస్కారాలను వీరిద్దరూ అందుకున్నారు. పురుషుల విభాగంలో గిల్ ఈ పురస్కారాన్ని ఐదోసారి గెలుచుకోగా, మహిళల విభాగంలో షఫాలీ వర్మ తన ఆటతీరుతో మరోసారి అవార్డును దక్కించుకున్నారు. భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఐసీసీ నెలవారీ ఉత్తమ పురుష ఆటగాడి పురస్కారాన్ని ఐదోసారి గెలుచుకున్నాడు. గతంలో 2023 జనవరి, సెప్టెంబరు నెలల్లో, 2025 ఫిబ్రవరి, జూలై నెలల్లో ఈ అవార్డును అందుకున్నాడు. తాజాగా మరోసారి పురస్కారం దక్కించుకోవడంతో ఈ ఘనత సాధించిన ఆటగాళ్లలో తన ప్రత్యేకతను చాటుకున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో గిల్ బ్యాట్‌తో మెరిశాడు. తిరువనంతపురంలో జరిగిన తొలి వన్డేలో 110 పరుగులు సాధించగా, రెండో వన్డేలో 223 పరుగులతో సత్తా చాటినట్లు సమాచారం. తన అభిమానుల ముందు పరుగులు సాధించడం ప్రత్యేక ఆనందాన్ని ఇచ్చిందని గిల్ పేర్కొన్నాడు. ఐదోసారి ఐసీసీ పురస్కారం అందుకోవడం గర్వంగా ఉందని, తనను ఎంపిక చేసిన ఐసీసీ ప్యానెల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపాడు. భారత మహిళా క్రికెటర్ షఫాలీ వర్మ కూడా ఐసీసీ నెలవారీ ఉత్తమ మహిళా ఆటగాడి అవార్డును గెలుచుకుంది. గత ఏడాది నవంబరులోనూ ఆమె ఈ పురస్కారాన్ని అందుకుంది. ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై కీలక ఇన్నింగ్స్ ఆడి భారత జట్టు విజయానికి తోడ్పడిన షఫాలీ, ఇటీవల జరిగిన పోటీల్లోనూ తన దూకుడైన ఆటను కొనసాగించింది. ఆసియా కప్‌లో షఫాలీ వర్మ 360 పరుగులు సాధించడంతో పాటు ఆరు వికెట్లు పడగొట్టింది. ఆసియా క్రీడల్లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో శతకం సాధించగా, శ్రీలంకతో జరిగిన ఫైనల్లో 48 పరుగులు చేసింది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ రాణించి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించింది. మరోసారి ఐసీసీ పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందని షఫాలీ పేర్కొంది. అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తూ గుర్తింపు పొందడం తనకు మరింత ఉత్సాహాన్ని ఇస్తుందని తెలిపింది. గిల్, షఫాలీకి అవార్డులు దక్కడంతో భారత క్రికెట్ అభిమానుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



# వెస్టిండీస్ ఆటగాళ్లకు ఐసీసీ మందలింపు

**దుబాయ్, అక్టోబరు 13 (ఉద్యమ కెరటం):** భారత్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు విజయం సాధించినప్పటికీ, ఆ జట్టు ఆటగాళ్లు రోవ్‌మన్ పావెల్, షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్‌లకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నుంచి మందలింపు ఎదురైంది. మైదానంలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు ఇద్దరికీ ఒక్కొక్క డీమెరిట్ పాయింట్ విధించినట్లు సమాచారం. అక్టోబరు 9న రాంచీలో భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ సందర్భంగా వెస్టిండీస్ కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ బ్యాట్‌తో బంతిని బాదిన ఘటనను ఐసీసీ పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే బ్యాటర్ షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ అంపైర్ నిర్ణయంపై అసహనం వ్యక్తం చేసిన వ్యవహారంపైనా చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలకు సంబంధించి పావెల్, రూథర్‌ఫర్డ్‌లను ఐసీసీ మందలించడంతో పాటు ఇద్దరికీ చెరో డీమెరిట్ పాయింట్ కేటాయించినట్లు వార్తలు వెల్లడించాయి. అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఆటగాళ్లు ఐసీసీ ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. మైదానంలో అనుచిత ప్రవర్తన, అంపైర్ల నిర్ణయాలపై అసహనం వ్యక్తం చేయడం వంటి ఘటనలపై నిబంధనలకు అనుగుణంగా క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. భారత్‌పై రెండో టీ20లో విజయం సాధించిన వెస్టిండీస్‌కు ఈ పరిణామం ఎదురైంది. అయితే ఈ చర్యలపై పూర్తి వివరాలు, అధికారిక ప్రకటనకు సంబంధించిన సమాచారం స్పష్టంగా అందుబాటులోకి రావాల్సి ఉంది.

# రంజీ ట్రోఫీలో అభిషేక్ పోరెల్ శతకం

**కల్యాణి, అక్టోబరు 13 (ఉద్యమ కెరటం):** బెంగాల్ వికెట్‌కీపర్ బ్యాటర్ అభిషేక్ పోరెల్ రంజీ ట్రోఫీలో అద్భుత ప్రదర్శన చేశాడు. ఢిల్లీతో జరుగుతున్న మ్యాచ్‌లో శతకంతో మెరిసిన అతడు.. సెంచరీ పూర్తి చేసిన వెంటనే భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఇటీవల వ్యక్తిగత, న్యాయపరమైన సమస్యలను ఎదుర్కొన్న అనంతరం మైదానంలోకి తిరిగి వచ్చిన పోరెల్ తన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. అతడి భావోద్వేగ క్షణాలు మైదానంలో అందరి దృష్టిని ఆకర్షించాయి. ఈ సీజన్‌లో బెంగాల్ తరఫున తొలి మ్యాచ్ ఆడుతున్న 23 ఏళ్ల పోరెల్.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 137 బంతుల్లో 114 పరుగులతో అజేయంగా నిలిచాడు. మరో బ్యాటర్ సుదీప్ ఘరామి సైతం 122 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు. వీరిద్దరూ శతకాలతో రాణించడంతో బెంగాల్ జట్టు భారీ స్కోరు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఢిల్లీ జట్టు 240 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బెంగాల్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి మూడు వికెట్ల నష్టానికి 304 పరుగులు చేసింది. దీంతో ప్రత్యర్థిపై 64 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. కీలక సమయంలో పోరెల్, ఘరామి జట్టును పటిష్ఠ స్థితిలో నిలిపారు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో తన రెండో శతకాన్ని పూర్తి చేసిన వెంటనే పోరెల్ మోకాళ్లపై కూర్చొని కన్నీళ్లు పెట్టుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత తేరుకుని బ్యాట్‌ను పైకెత్తి అభివాదం చేశాడు. ఈ దృశ్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. మ్యాచ్ అనంతరం పోరెల్ మాట్లాడుతూ.. తాను తెలియకుండానే భావోద్వేగానికి గురయ్యానని తెలిపినట్లు కథనాలు పేర్కొన్నాయి. మాటలతో కాకుండా తన ఆటతోనే సమాధానం చెప్పాలనుకుంటున్నట్లు



వెల్లడించాడు. కష్టకాలంలో తనకు అండగా నిలిచిన కోచ్ లక్ష్మీ రతన్ శుక్లా, ఇతరులకు కృతజ్ఞతలు తెలిపాడు. కర్ణాటకకు చెందిన ఓ వైద్య విద్యార్థిని పెళ్లి పేరుతో మోసం చేశాడని, అత్యాచారం, బెదిరింపులకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ పోరెల్‌పై ఫిర్యాదు చేసినట్లు వార్తలు వచ్చాయి. ఈ ఫిర్యాదు నేపథ్యంలో ఆగస్టు 11న పోలీసులు అతడిని అరెస్టు చేసినట్లు కథనాలు వెల్లడించాయి. నెల రోజులకు పైగా జైలులో ఉన్న అనంతరం సెప్టెంబరులో చిన్సురా కోర్టు నుంచి బెయిల్ పొందినట్లు సమాచారం. అయితే, తనపై వచ్చిన ఆరోపణలను పోరెల్ ఖండించినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఈ ఆరోపణలు న్యాయపరమైన విచారణకు సంబంధించినవి కావడంతో, వాటిని నిర్ధారిత నేరాలుగా పరిగణించరాదు. బెయిల్‌పై విడుదలైన తర్వాత పోరెల్‌కు బెంగాల్ రంజీ జట్టులో చోటు దక్కింది. అతడి వ్యక్తిగత, న్యాయపరమైన వ్యవహారాలు తమ పరిధిలోకి రావని, జట్టు ఎంపికలో అతడిని పరిగణనలోకి తీసుకున్నామని బెంగాల్ క్రికెట్ సంఘం తెలిపినట్లు సమాచారం. ఢిల్లీతో మ్యాచ్‌లో శతకం సాధించడం ద్వారా పోరెల్ తన క్రికెట్‌పై దృష్టి సారించాడు. అతడి ప్రదర్శన బెంగాల్ జట్టుకు కీలకంగా మారింది.

# ప్రపంచకప్ జట్టులో కోహ్లీ, రోహిత్‌కు చోటు దక్కేనా?

**న్యూఢిల్లీ, అక్టోబరు 13 (ఉద్యమ కెరటం):** 2027 వన్డే ప్రపంచకప్‌లో భారత స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఆడతారా? ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్ల భవిష్యత్తుపై కొంతకాలంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధ్యక్షుడు మిథున్ మన్హాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. జట్టు ఎంపికలో వయసు కంటే ఆటగాళ్ల ఫిట్‌నెస్, ప్రదర్శనకే ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. అయితే, తుది నిర్ణయం సెలెక్టర్లు, కోచ్‌లదేనని పేర్కొన్నారు. 2027 వన్డే ప్రపంచకప్ దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా జరగనుంది. ఈ మెగా టోర్నీలో భారత్ తరఫున ఎవరు బరిలోకి దిగుతారన్న అంశంపై ఇప్పటి నుంచే ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా వయసు పెరుగుతున్న కోహ్లీ, రోహిత్ జట్టులో కొనసాగుతారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై స్పందించిన మిథున్ మన్హాస్.. ప్రపంచకప్ జట్టు ఎంపికపై బీసీసీఐ నేరుగా నిర్ణయం తీసుకోదని, సెలెక్టర్లు, కోచ్‌లు ఆటగాళ్ల ప్రదర్శనను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారని వివరించినట్లు సమాచారం. ఆటగాడి వయసును మాత్రమే ప్రమాణంగా తీసుకోకుండా, అతడి ఫిట్‌నెస్, ఆటతీరు, జట్టుకు అందించే సహకారాన్ని పరిగణనలోకి తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించే సామర్థ్యం ఉన్నవారికి వయసు అడ్డంకి కాకూడదన్నది ఆయన వ్యాఖ్యల సారాంశం. భారత వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా వంటి అనుభవజ్ఞుల సహకారం ఎంతో ఉపయోగపడుతుందని మన్హాస్ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. కీలక మ్యాచ్‌ల్లో ఒత్తిడిని ఎదుర్కొన్న సీనియర్ ఆటగాళ్ల అనుభవం జట్టుకు బలాన్నిస్తుందని భావిస్తున్నారు.



అదే సమయంలో జస్‌ప్రీత్ బుమ్రా వంటి బౌలర్లు బౌలింగ్ విభాగంలో కీలక బాధ్యతలు చేపట్టగలరని పేర్కొన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో ఆటగాళ్లు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తే ప్రపంచకప్ వంటి పెద్ద టోర్నీల్లో విజయావకాశాలు మెరుగుపడతాయని విశ్లేషించారు. మాజీ భారత క్రికెటర్ మహమ్మద్ కైఫ్ కూడా 2027 ప్రపంచకప్ సన్నద్ధతపై తన అభిప్రాయాలను వెల్లడించారు. దక్షిణాఫ్రికా పిచ్‌లు బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే పరిస్థితుల్లో బౌలర్ల నాణ్యత కీలకంగా మారుతుందని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. ప్రత్యర్థి జట్లను తక్కువ స్కోరుకే పరిమితం చేయడంతో పాటు కీలక సమయాల్లో వికెట్లు తీయగల బౌలింగ్ విభాగం అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రపంచకప్‌ను గెలవాలంటే భారత్ బౌలింగ్‌తో పాటు ఫీల్డింగ్‌పైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని కైఫ్ సూచించారు. పరుగులను అడ్డుకోవడం, కీలక క్యాచ్‌లను అందుకోవడం, ఒత్తిడిలో తప్పిదాలను తగ్గించుకోవడం విజయానికి దోహదపడతాయని పేర్కొన్నారు. మొత్తంగా 2027 ప్రపంచకప్‌లో కోహ్లీ, రోహిత్ ఆడే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. వారి ప్రస్తుత ఫిట్‌నెస్, ప్రదర్శన, జట్టు అవసరాలను బట్టి ఎంపికపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. తుది జట్టు కూర్పుపై అధికారిక ప్రకటన వెలువడే వరకు ఈ అంశంపై ఉత్కంఠ కొనసాగనుంది.

# టీమిండియాలోకి ఔకిబ్ నబీ.. కారు కొనుగోలుపై చర్చ!

**గువాహటి, అక్టోబరు 13 (ఉద్యమ కెరటం):** జమ్మూకశ్మీర్‌కు చెందిన యువ క్రికెటర్ ఔకిబ్ నబీ భారత జట్టు తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. భారత్, వెస్టిండీస్ మధ్య జరిగిన వన్డే సిరీస్‌లో భాగంగా గువాహటిలోని బర్సాపరా క్రికెట్ స్టేడియంలో జరిగిన రెండో వన్డేలో టీమిండియా తరఫున తొలి మ్యాచ్ ఆడాడు. భారత స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ చేతుల మీదుగా జాతీయ జట్టు టోపీని అందుకున్నాడు. దీంతో జమ్మూకశ్మీర్ నుంచి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మూడో క్రికెటర్‌గా నిలిచాడు. గతంలో పర్వేజ్ రసూల్, ఉమ్రాన్ మాలిక్ ఈ ఘనత సాధించారు.

## షోరూమ్‌లో కారు.. సామాజిక మాధ్యమాల్లో చర్చ

అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఔకిబ్ నబీకి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆ వీడియోలో అతడు ఓ కార్ల ప్రదర్శనశాలలో హ్యుందాయ్ కారులో కూర్చొని కనిపించాడు. దీంతో నబీ కొత్త కారు కొనుగోలు చేశాడంటూ పలువురు అభిమానులు ఊహాగానాలు చేస్తున్నారు. అయితే, అతడు నిజంగానే కారును కొనుగోలు చేశాడా? అనే విషయంపై స్పష్టమైన సమాచారం లేదు.

## అరంగేట్ర మ్యాచ్‌లో నిరాశాజనక ప్రదర్శన

భారత జట్టులో చోటు దక్కించుకున్నప్పటికీ, తొలి వన్డేలో నబీకి కఠిన పరీక్ష ఎదురైంది. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న పిచ్‌పై బౌలింగ్ చేసిన అతడు 8.4 ఓవర్లలో 84 పరుగులు సమర్పించుకున్నాడు. ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి మ్యాచ్ కావడంతో అతడిపై అంచనాలు నెలకొన్నప్పటికీ, బౌలింగ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. భారత వన్డే జట్టుకు ఎంపిక కావడంతో నబీ ఇటీవల జరిగిన ఇరానీ కప్ మ్యాచ్‌కు జమ్మూకశ్మీర్ తరఫున అందుబాటులో లేకపోయాడు. ఆ మ్యాచ్‌లో జమ్మూకశ్మీర్ జట్టు రెస్ట్ ఆఫ్ ఇండియా చేతిలో 167 పరుగుల తేడాతో ఓటమి పాలైంది.

## రంజీ ట్రోఫీలో 60 వికెట్లు

2025–26 రంజీ ట్రోఫీ సీజన్‌లో ఔకిబ్ నబీ అద్భుతంగా రాణించాడు. ఏకంగా 60 వికెట్లు పడగొట్టి జమ్మూకశ్మీర్ జట్టు తొలిసారి రంజీ ట్రోఫీ టైటిల్ సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనతో అతడికి భారత టెస్టు జట్టులోనూ అవకాశం దక్కవచ్చనే అంచనాలు ఏర్పడ్డాయి. ఆగస్టులో శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్ కోసం ఎంపిక చేసిన భారత జట్టులోనూ నబీకి చోటు లభించింది. భారత్ ఆ సిరీస్‌ను 1–0తో గెలుచుకున్నప్పటికీ, తుది జట్టులో ఆడే అవకాశం అతడికి రాలేదు. అనంతరం ఇంగ్లాండ్ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో సర్రే జట్టు తరఫున ఆడాడు.

## సెలెక్టర్ల దృష్టిలో నబీ ప్రదర్శన

అంతర్జాతీయ స్థాయిలో తొలి మ్యాచ్ ఆడిన నబీ, రాబోయే పోటీల్లో తన బౌలింగ్‌తో ఆకట్టుకోవాల్సి ఉంది. అతడి ప్రదర్శనను భారత సెలెక్టర్లు పరిశీలించే అవకాశం ఉంది. భారత్–ఎ జట్టు న్యూజిలాండ్ పర్యటనతో పాటు రానున్న టెస్టు సిరీస్‌ల కోసం జట్ల ఎంపిక నేపథ్యంలో దేశవాళీ, అంతర్జాతీయ క్రికెట్‌లో అతడి ప్రదర్శన కీలకం కానుంది. రంజీ ట్రోఫీలో వికెట్ల వేటతో గుర్తింపు పొందిన నబీ, భారత జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకుంటాడా అనేది ఆసక్తికరంగా మారింది.





## టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు..

### మృణాల్ ఠాకూర్ కెరీర్‌లో ఊగిసలాట!

**హైదరాబాద్, అక్టోబర్ 13 (ఉద్యమ కెరటం):** టాలీవుడ్‌లో 'సీతారామం', 'హాయ్ నాన్న' వంటి బ్లాక్‌బస్టర్ విజయాలతో నటిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మృణాల్ ఠాకూర్ కెరీర్‌లో ప్రస్తుతం మిశ్రమ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ చిత్రాల తర్వాత ఆమె దూసుకెళ్తుందని అంతా భావించినప్పటికీ, 'ఫ్యామిలీ స్టార్' ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడం ఊహించని పరిణామమైంది. ఇక 'కల్కి 2898 ఏడి' చిత్రంలో ఆమె చేసిన మొక్కుబడి పాత్ర పెద్దగా వర్కౌట్ కాలేదు. ఈ ఏడాది వచ్చిన 'డెకాయిట్' చిత్రం డీసెంట్ హిట్‌గా నిలిచినప్పటికీ, ఆ పాత్రలోని విభిన్నమైన ట్విస్ట్ అభిమానులకు పూర్తిగా కనెక్ట్ కాలేదనే చెప్పాలి. ప్రస్తుతం సౌత్ ఆఫర్ల విషయంలో మృణాల్ కొంత ఆచితూచి అడుగులు వేస్తున్నారు. అల్లు అర్జున్ రాకా చిత్రంలో ఆమె నటిస్తున్నారంటూ గత కొంతకాలంగా జోరుగా ప్రచారం జరుగుతున్నప్పటికీ, మీడియా ప్రశ్నించినా ఆమె ఈ విషయాన్ని నేరుగా ధృవీకరించడం లేదు. చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించే వరకు ఈ ప్రాజెక్టు గురించి మాట్లాడకూడదన్న నిబంధన కారణంగానే ఆమె స్పందించడం లేదని సమాచారం. మరోవైపు బాలీవుడ్‌లో 2026 ఆమెకు అంతగా కలిసి రాలేదనే చెప్పాలి. 'దో దివానే షెహర్ మే', 'హే జవానీతో ఇష్క్ హోనా హై' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద దారుణంగా బోల్తా కొట్టాయి. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 'పూజా మేరీ జాన్' చిత్రం నేరుగా ఓటీటీలో విడుదలైనప్పటికీ సోషల్ మీడియాలో పెద్దగా సౌండ్ చేయలేదు. మొత్తంగా ఉన్నంతలో 'డెకాయిట్' ఒక్కటే ఆమెకు కొంత ఊరటనిచ్చింది. ఇక కథ ప్రకారం 'కల్కి 2'లోనూ ఆమె పాత్ర ఉండాల్సి ఉండగా, దర్శకుడు నాగ్ అశ్విన్ ఏలాంటి మార్పులు చేస్తారనే దానిపై త్వరలోనే స్పష్టత రానుంది.





# అందంతో కట్టిపడేస్తున్న టాలీవుడ్ బుట్టబొమ్మ..

### పూజా హెగ్డే బర్త్‌డే స్పెషల్!

**హైదరాబాద్, అక్టోబర్ 13 (ఉద్యమ కెరటం):** టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డే తన పుట్టినరోజును ఎంతో వేడుకగా జరుపుకుంటున్నారు. టాలీవుడ్ నుంచి కోలీవుడ్, బాలీవుడ్ వరకు తన అందం, అద్భుతమైన నటనతో మిలియన్ల మంది అభిమానుల మనసులను గెలుచుకున్న ఈ భామకు సోషల్ మీడియా వేదికగా సినీ ప్రముఖులు, అభిమానులు పెద్దఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని ఆమె షేర్ చేసిన గ్లామరస్ ఫొటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. సముద్రం బ్యాక్‌డ్రాప్‌లో బ్లూ అండ్ వైట్ డ్రెస్, బేబీ పింక్ గౌనులో రాయల్ లుక్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఇక పూజా నటించిన 'బుట్టబొమ్మ', 'అరబిక్ కుతు', 'జిగేల్ రాణి' వంటి సాంగ్స్ ఇప్పటికీ సోషల్ మీడియా రీల్స్‌లో ట్రెండ్ అవుతూనే ఉన్నాయి. గ్లామర్‌తో పాటు అద్భుతమైన డ్యాన్స్ మూవ్స్‌తో ఆమె ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారు. సినిమాల విషయానికి వస్తే, దుల్కర్ సల్మాన్‌తో కలిసి రవి నీలకూడితి దర్శకత్వంలో వస్తున్న 'శ్రీ శ్రీ' చిత్రంతో ఆమె టాలీవుడ్‌లోకి రీఎంట్రీ ఇస్తున్నారు. అలాగే లారెన్స్ హర్రర్ ఫ్రాంచైజీ 'కాంచన 4' వంటి భారీ చిత్రాల్లోనూ నటిస్తూ బాక్సాఫీస్ వద్ద విజయం సాధించేందుకు సిద్ధమవుతున్నారు.

## 'బ్రహ్మముడి' రుద్రాణి అసలు లుక్కు చూశారా?

**హైదరాబాద్, అక్టోబరు 13 (ఉద్యమ కెరటం):** బుల్లితెరపై నటీనటులు పోషించే పాత్రలు ప్రేక్షకులకు ఎంతో దగ్గరవుతుంటాయి. ముఖ్యంగా ధారావాహికల్లో ప్రతినాయకులుగా కనిపించే నటీనటులు తమ నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటారు. అలాంటి వారిలో నటి షర్మిత గౌడ ఒకరు. తెలుగులో ప్రసారమవుతున్న 'బ్రహ్మముడి' ధారావాహికలో రుద్రాణి పాత్రతో ఆమె ప్రేక్షకులకు చేరువయ్యారు. తెరపై గంభీరంగా, ప్రతికూల ఛాయలున్న పాత్రలో కనిపించే ఈమె.. నిజ జీవితంలో మాత్రం ఆధునిక దుస్తులు, ఆకర్షణీయమైన ఫొటోషూట్లతో సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తున్నారు. 'బ్రహ్మముడి' ధారావాహికను క్రమం తప్పకుండా చూసేవారికి షర్మిత గౌడ పేరు సుపరిచితమే. ఇందులో రుద్రాణి పాత్రలో కనిపిస్తూ తనదైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. పాత్రకు తగిన హావభావాలు, సంభాషణలు పలికే తీరు ద్వారా కథలో తన పాత్రకు ప్రత్యేకతను తీసుకొస్తున్నారు. తెరపై ఆమె కనిపించే తీరు, పాత్రలో చూపించే గంభీరత ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ధారావాహికలో సంప్రదాయబద్ధంగా, గంభీరంగా కనిపించే షర్మిత గౌడ.. వ్యక్తిగత ఫొటోల్లో మాత్రం భిన్నమైన శైలిని ప్రదర్శిస్తున్నారు. ఆధునిక దుస్తులు, కొత్త తరహా అలంకరణలు, అందమైన ఫొటోషూట్లతో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. తెరపై రుద్రాణిగా కనిపించే రూపానికి, సామాజిక మాధ్యమాల్లో పంచుకునే చిత్రాల్లోని రూపానికి మధ్య ఉన్న వ్యత్యాసం నెటిజన్లను ఆకర్షిస్తోంది. దీంతో ఆమె తాజా చిత్రాలు అభిమానుల దృష్టిని ఆకట్టుకుంటున్నాయి. షర్మిత గౌడ నటనా ప్రయాణం కన్నడ టెలివిజన్ రంగంలో ప్రారంభమైనట్లు సమాచారం. అక్కడ పలు ధారావాహికల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా 'గీత' ధారావాహికలో కథానాయకుడి తల్లి పాత్రలో కనిపించి కన్నడ ప్రేక్షకులకు చేరువైనట్లు కథనాలు పేర్కొంటున్నాయి. కుటుంబ కథా ధారావాహికల్లో విభిన్న పాత్రలు పోషించిన ఆమె.. తెలుగులో మాత్రం ప్రతికూల ఛాయలున్న రుద్రాణి పాత్రతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఇక షర్మిత వ్యక్తిగత జీవితం, కుటుంబ వివరాల గురించి తెలుసుకోవడానికి కూడా అభిమానులు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే ఆమె వయసు, పుట్టిన తేదీ వంటి వివరాలపై స్పష్టమైన ధ్రువీకరణ లేని సమాచారాన్ని నిజమని భావించకూడదు. ఏదేమైనా, తెరపై పాత్రకు తగ్గట్టుగా నటిస్తూ, బయట తనదైన శైలితో అభిమానులను ఆకట్టుకుంటున్న షర్మిత గౌడ బుల్లితెర ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు.





## దర్శకుడి అసభ్య ప్రతిపాదన..

### నటి నీతి టేలర్ సంచలన వ్యాఖ్యలు!

**హైదరాబాద్, అక్టోబరు 13 (ఉద్యమ కెరటం):** సినీ పరిశ్రమలో అవకాశాల పేరుతో కొత్తగా వచ్చే నటీనటులకు ఎదురవుతున్న అనుచిత ప్రతిపాదనలపై బుల్లితెర నటి నీతి టేలర్ సంచలన విషయాలను బయటపెట్టారు. తన సినీ ప్రయాణం ప్రారంభంలో ఎదురైన ఓ చేదు సంఘటనను గుర్తుచేసుకుంటూ.. దక్షిణాది చిత్ర పరిశ్రమలో రెండో సినిమా అవకాశం కోసం ఓ దర్శకుడు తనకు అసభ్యకరమైన షరతు విధించాడని ఆవేదన వ్యక్తం చేశారు. టెలివిజన్ రంగంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న నీతి టేలర్, దక్షిణాదిలో తొలి సినిమా పూర్తి చేసిన తర్వాత మరో చిత్రంలో అవకాశం కల్పిస్తానంటూ సదరు దర్శకుడు సంప్రదించాడని తెలిపారు. అయితే ఆ సినిమాలో అవకాశం కావాలంటే తనతో శారీరక సంబంధం పెట్టుకోవాలని షరతు పెట్టడంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైనట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని తన తల్లికి చెప్పుకుని కన్నీళ్లు పెట్టుకున్నానని, ఆ సమయంలో తల్లి ఇచ్చిన ధైర్యంతో ఆ దర్శకుడి ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేసినట్లు వెల్లడించారు. సినిమాల్లో ఇలాంటి పరిస్థితులు ఎదురవడంతో మనస్తాపానికి గురై, తిరిగి టెలివిజన్ రంగంపైనే దృష్టి సారించినట్లు నీతి టేలర్ వివరించారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# కార్మిక గర్జన బహిరంగ సభను విజయవంతం చేయండి

- మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



**ఉద్యమ కెరటం, తాండూర్:** గోదావరి ఖనిలో బుధవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న "సింగరేణి కార్మిక గర్జన"భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బెల్లంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పిలుపునిచ్చారు. మంగళవారం తాండూర్ గ్రామంలోని బీఆర్ ఎస్ పార్టీ నాయకులు ఎలుక రామచందర్ నివాసంలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. సభ విజయవంతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఈ సభకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని, ఈ నేపథ్యంలో తాండూర్ మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, సింగరేణి కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ తాండూర్ మండల అధ్యక్షులు సుబ్బ దత్తు మూర్తి, మాజీ ఎంపీపీ పూసల ప్రణయ్ కుమార్, మాజీ జెడ్పీటిసి మంగపతి సురేష్ బాబు, సీనియర్ నాయకులు ముహూర్కర్ దత్తాత్రేయ రావు, బోనగిరి చంద్రశేఖర్, మసాడి శ్రీరాములు, గట్టు సంతోష్ కుమార్, మొగిలి శంకర్, గడ్డం మణికుమార్, కిష్టఫర్, దుర్గం శ్రీనివాస్, బోడ సతీష్, జాడి పోషం, గోమాస తిరుపతి, చింటూ, బాబు ఖాన్, ప్రదీప్ రావు, ఉప్పట్ల సంతోష్, ఇక్బాల్, రాజేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ భద్రత సూచనలు పాటించాలి

**ఉద్యమ కెరటం, సిర్పూర్(యు):** ప్రజలు తప్పని సరిగా విద్యుత్తు భద్రత సూచనలు పాటించాలని డీఈ సుధాకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నివాసం కలిగిన ప్రతిఒక్కరు విద్యుత్ మీటరు తప్పని సరిగా కలిగి ఉండాలన్నారు. కరెంటు చోరీకి పల్పడ వద్దని పేర్కొన్నారు. కరెంటు తీగలకు కొండ్లు వేయడం సరైంది కాదని, వ్యవసాయ చేన్లలో కొందరు అడవి జంతువులకు నివారించడానికి తీగలు అమర్చుతున్నారని తెలిపారు. ఇలాంటివి నేరం మాత్రమే కాకుండ ప్రాణాంతకమని పేర్కొన్నారు. దీంతో జంతులు మాత్రమే కాకుండా ప్రజల ప్రాణాలు సైతం పోయే ప్రమాదం ఉంటుందన్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్య తలెత్తిన వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. వైర్లు కింద పడి కనిపిస్తే వాటికి తాకకుండా దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎఈ సాయికృష్ణ, శ్రావన్, అధికారులు పాల్గొనారు.



# కొలాంల అభివృద్ధికి సహకరించాలి



**ఉద్యమ కెరటం, సిర్పూర్(యు):** కొలాం ప్రజల అభివృద్ధికి సహకరించాలని కొలాం సంఘం జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ కొలాం సంఘాల ఉమ్మడి గౌరవ అధ్యక్షులు ఆత్రం రాజు కోరారు. మంగళవారం సిర్పూర్( యూ) మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కుంరం సూరు చిత్రపటాన్ని తహశీల్దార్ ఎండి జమీర్ కు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ కులస్తుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరిస్తూ వారిని చైతన్యపర్చాలని కోరారు. తమ సంఘం ఆధ్వర్యంలో మూడు మండలాల ఉమ్మడి సమావేశాన్ని లింగాపూర్ మండలం రావునూర్ లో ఈనెల 16న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి మూడు మండలాల కొలాం ప్రజలు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బాపురావు, భీంరావు, భుజంగరావు బారిక్ రావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత

- మున్నూరుకాపు సంఘం కుంకుమార్చనలో మున్సిపల్ చైర్ పర్సన్

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆధ్యాత్మికతతోనే మనస్సుకు ప్రశాంతత లభిస్తుందని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మున్నూరుకాపు సంఘంలో మంగళవారం నిర్వహించిన కుంకుమార్చన పూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారికి కుంకుమ అర్చన చేయడం ద్వారా కుటుంబాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని పేర్కొన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అని తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, భక్తిభావాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.



# పోలీసులపై అసత్య ప్రచారం.. ఇద్దరు అరెస్ట్

- దర్యాప్తును తప్పదోవ పట్టించేలా కథనాలు రాస్తే చర్యలు తప్పవు
- సీఐ ఓదెల వెంకటేష్




**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** ఎల్లారెడ్డిపేట సర్కిల్ పరిధిలోని గంభీరావుపేట పోలీస్ స్టేషన్లో ఈనెల 13న నమోదైన కేసు విషయంలో పోలీసుల దర్యాప్తుకు సహకరించకుండా, అడిగిన సమాచారాన్ని అందించకుండా గంభీరావుపేట ఎస్సైతో పాటు ఇతర పోలీసు అధికారులపై అసత్య ప్రచారం చేస్తూ, వ్యక్తిగతంగా కించపర్చే విధంగా వరుస కథనాలు రాస్తూ, పోలీసుల దర్యాప్తును తప్పుదోవ పట్టించేలా వ్యవహరించినట్లు ఆరోపణలపై ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు యల్లా రెడ్డిపేట సీఐ ఓదెల వెంకటేష్ తెలిపారు. ఏగ్రం న్యూస్ పత్రిక ఎడిటర్, నిర్వాహకులైన పోతూరి శేఖర్, రాతిపల్లి సంపత్ లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మంగళవారం కరీంనగర్లో వారిని అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వార్తలు ప్రచురించే ముందు సంబంధిత అంశాల పూర్వాపరాలను పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. వాస్తవాలను నిర్ధారించకుండా వ్యక్తిగతంగా కించపర్చే కథనాలు రాయడం, అసత్య సమాచారాన్ని ప్రచారం చేయడం, సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారానికి పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య**

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** గ్రామపంచాయతీల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నాణ్యత ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం బెల్లంపల్లి మండలం బూదకలాన్ గ్రామపంచాయతీ పరిధిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా చేపడుతూ గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణపై మండల తహశీల్దార్, సంబంధిత అధికారులతో సమీక్షించి స్థల సమస్యను పరిష్కరించారు. గ్రామంలో నిర్మించిన కల్వర్టుతో పాటు అవెన్యూ ప్లాంటేషన్ను పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పచ్చదనం పెంపొందించడం, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రేణుకుంట్ల మహేందర్, మండల పంచాయతీ అధికారి కృష్ణవేణి, సర్పంచులు దాడి నగేష్, వంగ రాములు, సాగర్ల లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు




**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ముగింపు వేడుక సద్దుల బతుకమ్మను బెజ్జూర్ మండల కేంద్రంలోని కుట్టు మిషన్ శిక్షణ కేంద్రంలో మంగళవారం మహిళలు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శిక్షణ కేంద్ర సభ్యులైన మహిళలు రంగురంగుల సాంప్రదాయ దుస్తులు ధరించి, తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి తీరొక్క రంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. బతుకమ్మ పాటలకు డీజే సంగీతానికి అనుగుణంగా లయబద్ధంగా నృత్యం చేస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో ప్రతి దేవుడిని పూజించడానికి పూలను ఉపయోగిస్తే, తెలంగాణలో మాత్రమే పూలనే దేవతగా భావించి బతుకమ్మగా పూజించడం మన సంస్కృతి గొప్పతనమన్నారు. ఇలాంటి సాంప్రదాయాలను కాపాడుకోవడం, భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అని తెలిపారు. ఈ వేడుకల్లో వార్డు సభ్యులు రామడుగుల రమేష్, శిక్షణ కేంద్ర ఇన్స్ట్రక్టర్ తో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# కనకదుర్గమ్మ ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలి

**డాక్టర్ మట్టా దయానంద్**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** కనకదుర్గమ్మ ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ కోరారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలంలోని కుభేర ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ మండపం వద్ద మంగళవారం అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ మట్టా దయానంద్ను ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మండల కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సైగా పదోన్నతి పొందిన ముండే ఉద్ధవ్కు సన్మానం







**ఉద్యమ కెరటం, జైనూర్:** పోలీస్ శాఖలో అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న ముండే ఉద్ధవ్ ఏఎస్సై నుంచి ఎస్సైగా పదోన్నతి పొందారు. గతంలో జైనూర్ పోలీస్ స్టేషన్లో ఏఎస్సైగా విధులు నిర్వహించిన ఆయన ప్రస్తుతం స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ)లో ఎస్సైగా నియమితులయ్యారు. పదోన్నతి పొందిన అనంతరం జైనూర్కు వచ్చిన ముండే ఉద్ధవ్ను జైనూర్ సీఐ రమేష్, ఎస్సై రవికుమార్తో పాటు పోలీస్ సిబ్బంది ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# విబిజి రామ్జీ పనుల పరిశీలన





**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని పవర్గూడ గ్రామంలో విబిజి రామ్జీ పథకానికి సంబంధించి చేపట్టిన ఫారం పనులపై అధికారులు మంగళవారం క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన పనులను ప్రత్యక్షంగా పరిశీలించి, పనులకు సంబంధించిన వివరాలను తనిఖీ చేశారు. పనుల ప్రస్తుత పరిస్థితి, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులను పరిశీలించి సమాచారాన్ని సేకరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాల ద్వారా చేపట్టే పనుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం, పనుల పురోగతిని తెలుసుకోవడం, సంబంధిత రికార్డులను తనిఖీ చేయడం వంటి అంశాల్లో భాగంగా ఈ పరిశీలన చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ పరిశీలనలో సీఈఓ లక్ష్మీనారాయణ, జైనూర్ ఎంపీడీఓ కృష్ణవేణి, ఎంపీఓ శశికుమార్, ఏపీఓ నగేష్, పవర్గూడ గ్రామ సర్పంచ్ తొడసం రాజేందర్, పంచాయతీ కార్యదర్శి ఎం.కిషోర్, ఫీల్డ్ అసిస్టెంట్ ఉత్తమ్ తదితరులు ఉన్నారు.

# నీరు నిల్వ చేసే పనులను చేపట్టా లి

## ఫారంఫండ్ పనులను పరిశీలించిన జెడ్పీ సీఈఓ



**ఉద్యమ కెరటం, సిర్పూర్(యు):** నీరు నిల్వ చేసే పనులను అధికంగా చేపట్టాలని జెడ్పీ సీఈఓ లక్ష్మి నారయణ అన్నారు. మంగళవారం మండలంలోని నేట్నూర్ లో కొనసాగుతున్న ఫారంఫండ్ పనులను పరిశీలించారు. విబిజి రామ్ జీ ద్వారా నిర్వహిస్తున్న పనులను పరిశీలించారు. ఈ యేడాది వర్షాలు తక్కువగా నమోదు కావడంతో నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రంలో ఎంపీడీఓ రవిందర్, ఏపిఓ, టీఏలు, పంచాయితీ సెక్రెటరీ సోయం దేవరావు, సర్పంచ్ మడవి లక్ష్మణ్ తదితరులు పాల్గొ న్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయురాలికి అభినందనలు

## ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

**ఉద్యమ కెరటం,దమ్మపేట:**

దమ్మపేట మండలం, గండుగులపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయురాలు మెచ్చు రాణి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో 'జీ తెలుగు' ఆధ్వర్యంలో నిర్వహించిన "గురు వందనం – 2026" కార్యక్రమంలో ఆమె ప్రశంస పత్రం తో పాటు జ్ఞాపికను అందుకున్నారు. ఈ వేడుకకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ సలహాదారుడు కే కేశవరావు, ఎం.పి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే హరీష్ రావు ముఖ్య అతిథులుగా హాజరుకాగా, మంత్రులు మరియు ప్రముఖులు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మంగళవారం మెచ్చు రాణి పని చేసే పాఠశాలకు వెళ్ళి స్వయంగా కలిసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయురాలు జిల్లా స్థాయిలో గుర్తింపు పొంది అవార్డు అందుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి విద్యను అందిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేయడంలో కీలక పాత్ర పోషించడం గర్వకారణంగా ఉందని తెలిపారు. మెచ్చు రాణి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి

- అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు.. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

**ఉద్యమ కెరటం,కుత్బుల్లాపూర్ ప్రతినిధి:** కుత్బుల్లాపూర్ గార్డెన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్, కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు మంగళవారం నిర్వహించిన దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొ న్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. అనంతరం ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరారెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, దుర్గా మాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో, అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

# సమన్వయంతో పనిచేసి గంజాయి రహిత జిల్లాగా తీర్చి దిద్దాలి

## జిల్లా కలెక్ట ర్ రాజర్షిషా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** యువత భవిష్యత్తుకు పెను ముప్పుగా విస్తరిస్తున్న గంజాయి సాగు, విక్రయాలు, అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్ట ర్ మాట్లాడుతూ సమాజాన్ని పట్టిపీడిస్తున్న గంజాయి భూతాన్ని అంతం చేసేందుకు అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్, అటవీ, వ్యవసాయ శాఖలు పరస్పర సమన్వయంతో క్షేత్రస్థాయిలో నిరంతర నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక ప్రాంతాలు, సరిహద్దు తనిఖీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎక్కడైనా అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందితే తక్షణమే స్పందించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ గంజాయి కట్ట డి విషయంలో పోలీస్ శాఖ రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గంజాయి విక్రయదారులు, సరఫరాదారుల పూర్తి వివరాలు సేకరించి పీడీ యాక్ట్ సహా కేసులు నమోదు చేస్తామన్నారు. విద్యార్థులు, యువత ఈ వ్యసనాల బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలలు, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తామని అన్నారు.



గంజాయి అక్రమ రవాణాపై ప్రజలు నిర్భయంగా సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు అత్యంత గోప్యంగా ఉంచుతామని భరోసానిచ్చారు. అనంతరం ఆహార భద్రత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలోని హోటళ్లు, రెస్టా రెంట్లు బేకరీలు, ఇతర ఆహార విక్రయ కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించేలా తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే ఎలాంటి ఉపేక్ష ఉండదని, కల్తీ ఆహారం విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్ఎస్. చిత్రు, సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డీఎంహెచ్ఓ సాధన, రిమ్స్ డైరెక్ట ర్ జైసింగ్ రాథోడ్, డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, ఆహార భద్రత అధికారిణి బి.ప్రత్యూష, పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలి





- రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్

**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ఎ.వాణీ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బతుకమ్మ వేడుకల ఫొటోలు, వీడియోలతో విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. మంగళవారం బతుకమ్మ వేడుకల నిర్వహణ, పర్యాటక అభివృద్ధి పనులు, నిధుల సమీకరణ, పర్యాటక ప్రాంతాల్లో భద్రత ఏర్పాట్లపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఐడీఓసీ నుంచి సమావేశంలో పాల్గొన్నారు. బతుకమ్మ వేడుకల్లో మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని వాణీ ప్రసాద్ సూచించారు. వేడుకలు జరిగే ప్రాంతాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, రవాణా, పార్కింగ్, భద్రత వంటి సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలాగే ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం, నీటి లభ్యత, వ్యవసాయం, పర్యావరణంపై ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. బతుకమ్మ పాటల పోటీల్లో నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, నీటి పొదుపు అంశాలను ప్రతిబింభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలకు బదిలీ చేసిన పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులను సంబంధిత ఇంజినీరింగ్ శాఖల సమన్వయంతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల నాణ్యత, పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, ప్రాజెక్టుల డీపీఆర్ తయారీ బాధ్యతలను రెండు వారాల్లోగా సంబంధిత శాఖలకు, సంస్థలకు అప్పగించాలని సూచించారు. పాక్షికంగా పూర్తయిన హరిత హోటళ్ల నిర్మాణాలను పూర్తి చేసి నిర్వహణలోకి తీసుకువచ్చేందుకు పీపీపీ విధానంలో అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. జిల్లాల్లోని చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలను గుర్తించి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. స్వదేశ్ దర్శన్ పథకంతో పాటు ఇతర ప్రభుత్వ పథకాలు, ప్రైవేట్ పెట్టుబడుల ద్వారా నిధుల సమీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని రెండు మున్సిపాలిటీలు, అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో బతుకమ్మ పండుగకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. మహిళలు బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలని, నీటి వనరుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టడంతో పాటు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లా స్థాయి బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా విద్యాధికారి విజయ్ సాగర్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, డీటీసీపీఓ అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

# వినూత్న ఆలోచన.. అమ్మవారి మండపము వద్ద ఐపీఎస్ అధికారుల ఫ్లెక్సీ..

- దేవి శరన్నవరాత్రి మండపంలో 12 మంది పోలీసు అధికారుల చిత్రాలు
- ఆధ్యాత్మికతతో పాటు సామాజిక చైతన్యానికి పెద్దపీట
- యువ కిరణం స్పోర్ట్స్ అసోసియేషన్ వినూత్న ప్రయత్నం

**ఉద్యమ కెరటం,దుబ్బాక ప్రతినిధి:**

పండుగలు కేవలం ఆధ్యాత్మిక వేడుకలకే పరిమితం కాకుండా సమాజానికి మంచి సందేశాన్ని అందించే వేదికలుగా మారాలన్న ఆలోచనకు దుబ్బాక పట్ట ణంలోని యువ కిరణం స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు కార్యరూపం ఇస్తున్నారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏటా వినూత్న రీతిలో మండపాన్ని ఏర్పాటు చేస్తూ భక్తుల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు సామాజిక బాధ్యతపై అవగాహన కల్పిస్తున్నారు. ఈసారి తెలంగాణలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తున్న 12 మంది ఐపీఎస్ అధికారుల చిత్రాలతో ఫ్లెక్సీని ఏర్పాటు చేసి అందరి దృష్టి ని ఆకర్షిస్తున్నారు.

### ఏటా ఓ ప్రత్యేక సందేశం

దుబ్బాక పట్టణంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయంటే యువ కిరణం స్పోర్ట్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసే మండపాన్ని సందర్శించేందుకు భక్తులు ఆసక్తి చూపుతుంటారు. గత కొన్నేళ్లుగా ప్రతి సంవత్సరం ఓ వినూత్న ఆలోచనతో మండపాన్ని అలంకరిస్తూ ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసే ఫ్లెక్సీల ద్వారా ప్రజలకు కీలక సందేశాలను అందిస్తున్నారు. గతంలో హెల్మెట్ వినియోగం, ఓటు హక్కు ప్రాధాన్యం, డ్రగ్స్ నిర్మూలన, ఆన్‌లైన్ బెట్టి ంగ్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించేలా ఏర్పాట్లు చేసి తమ ప్రత్యేకతను చాటుకున్నారు.

### పోలీసు సేవలకు గుర్తింపుగా

ఈ ఏడాది మరో అడుగు ముందుకేసి తెలంగాణలో వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న 12 మంది ఐపీఎస్ అధికారుల చిత్రాలను మండపం వద్ద ఏర్పాటు చేశారు. డ్రగ్స్ నిర్మూలన, ఆన్‌లైన్ బెట్టి ంగ్‌ల నియంత్రణ, రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, మూఢనమ్మకాలపై అవగాహన వంటి అంశాల్లో పోలీసు శాఖ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు గుర్తుచేసేలా ఈ ఫ్లెక్సీని రూపొందించారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తూ ప్రజల భద్రత, సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న పోలీసు అధికారుల సేవలను గుర్తించడం ఈ ప్రయత్నం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.

### ఆధ్యాత్మికతతో పాటు సామాజిక చైతన్యం

దేవి మండపానికి వచ్చే భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతో పాటు ఫ్లెక్సీపై ఉన్న పోలీసు అధికారుల చిత్రాలు, వారు ప్రాతినిధ్యం వహిస్తున్న సేవా రంగాలను ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. భక్తిభావాన్ని పెంపొందించే ఉత్సవాల్లో సమాజానికి ఉప యోగపడే అంశాలకు చోటు కల్పించడం ద్వారా యువతలో సామాజిక స్పృహను పెంపొందించవచ్చని అసోసియేషన్ సభ్యులు తమ కార్యక్రమంతో చాటి చెబుతున్నారు.

### పట్ట ణంలో ప్రత్యేక చర్చ

వినూత్న ఆలోచనతో రూపొందించిన ఈ మండపం ప్రస్తుతం దుబ్బాక పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా పలువురు వచ్చి మండపాన్ని సందర్శిస్తూ అమ్మవారిని దర్శించు కుంటున్నారు. ఉత్సవాల నిర్వహణతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్న యువ కిరణం స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులను భక్తులు, పట్ట ణ ప్రజలు అభినందిస్తున్నారు. పండుగ వేదికను సామాజిక సందేశాల ప్రచారానికి వినియోగిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్న ఈ ప్రయత్నం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

# ప్రజల తాగునీటి కష్టాల పరిష్కారమే లక్ష్యం

- జగద్గిరి నగర్ లో నూతన పైప్ లైన్ పనులకు శంకుస్థాపన చేసిన జగన్

**ఉద్యమ కెరటం,కుత్బుల్లాపూర్ ప్రతినిధి:** జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని జగద్గిరి నగర్‌లో ప్రజలకు తాగునీటి సమస్యకు పరిష్కారం చూపే దిశగా నూతన పైపులైన్ పనులకు మంగళవారం డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ శంకుస్థాపన చేశారు. స్థానికులకు మెరుగైన తాగునీటి సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ పనులను చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కొలుకుల జగన్ మాట్లాడుతూ.. తాను కార్పొరేటర్‌గా ఎన్నికైన నాటి నుంచి జగద్గిరిగుట్ట డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేసినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీతో పాటు ప్రజలకు అవసరమైన పలు మౌలిక సదుపాయాలను కల్పించినట్లు వివరించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, తక్కువ వర్షపాతం నేపథ్యంలో రానున్న రోజుల్లో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని, తాగునీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి తన వంతు కృషి నిరంతరం కొనసాగిస్తానని హామీ ఇచ్చారు. ఈ



కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొగ్గుల సురేష్, తోక యాదగిరి, మనోజ్, మాయకోటి ప్రభాకర్, బ్రహ్మయ్య, ప్రభాకర్, కుమారస్వామి, సంతోష్, సత్తిరెడ్డి, విజయ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# జానపద సోయగం... జాలాది సాహిత్యం

## పల్లె పలుకును పాటగా మలిచిన జనకవి జాలాది

### నేడు జాలాది వర్ధంతి

**తెలుగు సాహిత్య గగనంలో కొన్ని నక్షత్రాలు కవిత్వపు కాంతులతో మెరిస్తే, మరికొన్ని ప్రజల గుండెల చప్పుడై, వారి పెదవులపై పాటై అమరత్వాన్ని పొందుతాయి. సాంప్రదాయ కవిత్వపు పొలిమేరల నుంచి జానపద జీవన ముంగిట్లోకి సాహిత్యాన్ని నడిపించి, మట్టివాసనల సౌరభాన్ని వెండితెరకు అద్దిన అరుదైన గేయశిరోమణి జాలాది రాజారావు. పల్లె సీమల సహజ సౌందర్యాన్ని, సామాన్యుల బతుకు పోరాటాన్ని, పేదల అనుభూతులను తన కలానికి ఇంధనంగా మార్చుకున్న అక్షర శిల్పి ఆయన. జాలాది పాట ఒక శబ్ద సమ్మేళనం మాత్రమే కాదు; అది ఒక ప్రాంతీయ జీవన చిత్రం, ఒక సామాజిక దర్పణం, మానవ సంబంధాల అంతఃసూత్రం.**

కృష్ణా జిల్లా గుడివాడ నేలపైన అమృతమ్మ, జాలాది ఇమ్మానుయేలు దంపతులకు 1932 ఆగస్టు 9న జాలాది రాజారావు జన్మించారు. తండ్రి స్వాతంత్ర్య సమర యోధుడిగా, జిల్లా బోర్డు సభ్యుడిగా అందించిన సామాజిక స్పృహ జాలాది వ్యక్తిత్వానికి పునాది వేసింది. ఎస్.ఎస్.ఎల్.సీ.లో తెలుగు ప్రత్యేక పాఠ్యాంశంతో ఉ ఉత్తీర్ణులైన ఆయన, చిత్రలేఖనం పట్ల ఉన్న ఆసక్తితో డ్రాయింగ్ ఉపాధ్యాయుడిగా ప్రస్థానం ప్రారంభించారు. శ్రీకాకుళం జిల్లా వీరఘట్టంతో పాటు రాష్ట్రంలోని పలు పాఠశాలల్లో పనిచేసిన కాలం ఆయన జీవితంలో కీలకమైన మలుపు. ఆయా ప్రాంతాల మాండలికాలు, మౌఖిక జానపద రూపాంతరాలు, ప్రజల నోటి పలుకు బడులను ప్రత్యక్షంగా శోధించి స్వీకరించే అవకాశం ఈ ఉద్యోగ జీవితమే కల్పించింది. అక్షరాలకు రంగులు అద్దే క్రమంలో ఆయనలోని కవిత్వం పరిణతి చెందింది. ఫలితంగా 1968లో ఉపాధ్యాయ వృత్తికి స్వస్తి చెప్పి, సాహిత్య సాధనకై మద్రాసు సినీ నికేతనానికి పయనమయ్యారు.

1976లో 'పల్లెసీమ' చిత్రంతో సినీ గేయ ప్రపంచంలోకి అడుగుపెట్టిన జాలాది, సంగీత దర్శకుడు కె.వి. మహదేవన్ స్వరకల్పనలో రాసిన "సూరట్టుకు జారతాది సిటుక్కు సిటుక్కు వాన చుక్క" పాటతో తెలుగు శ్రోతలను ఒక్కసారిగా పరవశింప జేశారు. ఆరంభంలోనే జానపద శైలికి కొత్త ఊపిరి పోసిన ఆయన, ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానంలో సుమారు 270కి పైగా చిత్రాలకు 1,500 నుండి 1,800 వరకు సజీవ గీతాలను అందించారు. గణాంకాలలో స్వల్ప వ్యత్యాసాలు ఉన్నప్పటికీ, ప్రతి పాటలోనూ ఒక నాటుదనం, శ్రామిక సౌందర్యం నిండి ఉ ండటం ఆయన ప్రత్యేకత. 'మజూరి' శ్రమను 'మాధురి'గా మార్చడంలో జాలాది కలం సిద్ధహస్తుడు.

జాలాది గేయ సాహిత్యాన్ని పరిశీలిస్తే అందులో భావ కవిత్వపు లాలిత్యం, జానపదపు వాకిలి, సామాజిక దృక్పథాల త్రివేణి సంగమం కనిపిస్తుంది. "యాతమేసి తోడినా ఏరు ఎండదు" అని అమాయక రైతు హృదయాన్ని ఆవిష్కరించినా, "ఈ కాలం పది కాలాలు బతకాలనీ" అని కుటుంబ అనుబంధాల ప్రాశస్త్యాన్ని చాటినా, "పుణ్యభూమి నా దేశం నమో నమామి" అని దేశభక్తి నిండిన భావోద్వేగాన్ని విశ్వరూపంలో చూపించినా అది జాలాదికే సాధ్యమైంది. భావాన్ని క్లిష్టమైన గ్రాంథికంలో కాక, నిత్య జీవితంలో ఉ పయోగించే తెలుగు నుడికారంలో, మాండలికాల సొబగులో పొదిగి చెప్పడం ఆయన రచనా వైశిష్ట్యం.

ఆయన ప్రతిభ కేవలం చలనచిత్ర రంగానికే పరిమితం కాలేదు. రంగుల లోకానికి రాకముందే 'విశ్వ మోహిని', 'కాకులమ్మ' వంటి కావ్యాలను, 'అమరజీవి', 'తండ్రి', 'సమాధి', 'కారు మేఘాలు' వంటి నాటకాలను రచించి రసజ్ఞుల మెప్పు పొందారు. ఉ పాధ్యాయుడిగా పొందిన పరిశీలనా దృష్టి, కవిగా సాధించిన భావ పరిపక్వత, నాటకకర్తగా పండించిన సంభాషణా చతురత---ఈ మూడూ కలిసి ఆయనను అసాధారణ గేయ రచయితగా నిలబెట్టాయి.

ఈ సాహిత్య సేవలకు గాను ఆయనకు అనేక సత్కారాలు లభించాయి. విజయవాడ కల్చరల్ అసోసియేషన్, ట్విన్ సిటీస్ కల్చరల్ అవార్డులతో పాటు 1987లో మద్రాసు కలాసాగర్ అవార్డు దక్కింది. 1990లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నంది పురస్కారంతో గౌరవించగా, తదనంతర కాలంలో ఆంధ్ర విశ్వ విద్యాలయం 'కళాప్రపూర్ణ' బిరుదును అందజేసింది. 2011 అక్టోబరు 14న విశాఖపట్నంలో ఆయన భౌతిక దేహాన్ని విడిచినప్పటికీ, ఆయన రాసిన పాటలు తెలుగువారి గుండెల్లో శాశ్వతంగా నిలిచి పోయాయి.

కృత్రిమ అలంకారాల కన్నా సహజ అనుభూతికి, సంక్లిష్ట సమాసాల కన్నా పల్లె పదబంధాలకే జాలాది ప్రాణప్రతిష్ఠ చేశారు. వెండితెరపై జనపదాల గొంతును నిలబెట్టి, పల్లె మనిషి ఆవేదనకు అక్షర రూపమిచ్చిన ఈ ప్రజాకవి, తెలుగు సినీ సాహిత్య చరిత్రలో చెరగని ముద్ర వేసిన జానపద గేయశిరోమణిగా చిరస్మరణీయుడు.

# నాడు జోగి బ్రదర్స్.. నేడు 'స్తంభం' బ్రదర్స్!

## నాడు బుల్లితెరపై వారిది హవా..

## నేడు ఓ మండల కేంద్రంలో వీరిదే హవా?



**ఉద్యమ కెరటం, హైదరాబాద్:** బుల్లితెరపై ఒకనాడు జోగి బ్రదర్స్ హవా నడిచినట్టే.. నేడు ఒక రిజర్వ్‌డ్ నియోజకవర్గంలోని ఓ కీలక మండలానికి చెందిన 'స్తంభం' బ్రదర్స్ హవా నడుస్తోంది. కనీసం వార్డు మెంబర్లుగానైనా గెలవని వారు.. నేడు 'ఆ ఎమ్మెల్యే మా సారేననీ.. ఆయన అండదండలు మాకే ఉన్నాయి' అని చెప్పుకుంటూ మండలంలో చక్రం తిప్పుతున్నట్లుగా వారికి వారే భావిస్తుండడం కొంత ఆశ్చర్యయానికి గురి చేస్తోంది.

### 'ఆన్‌లైన్' కమీషన్లు చాలవంటూ..

మండలకేంద్రంలో ఆన్‌లైన్ సెంటర్ నిర్వహించుకునే స్తంభం బ్రదర్స్‌కు అందులో వచ్చే కమీషన్లతో పాటు స్థానికంగా ఉన్న ఓ ప్రభుత్వ కార్యాలయంలో వచ్చే కమీషన్లు చాలవంటూ ఏకంగా శాసనసభ్యుడి కార్యాలయాన్నే టార్గెట్ చేశారు. తాము ఎమ్మెల్యే పీఏలమని చెప్పుకుంటూ మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేయించుకోవడమే కాకుండా అందిన కాడికి దండుకుంటున్నారు. ప్రజాబలంలో గెలిచి, అధికార పార్టీలో నాయకులు కొనసాగుతున్న నేతలే కిమ్మనకుండా కూర్చుంటుంటే సదరు స్తంభం సోదరులు మాత్రం అన్ని కార్యాలయాల్లో హల్చల్ చేస్తూ తమకు అందినకాడికి దోచుకుపోతున్నారు.

### అధికారులే వారి టార్గెట్..

కమీషన్లకు మరిగిన స్తంభం బ్రదర్స్‌కు మేయిన్ టార్గెట్ అధికారులే. ఎవరైతే వారి మాట వినరో వారిని ట్రాన్స్ఫర్ చేయడమే తమ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. గత ఎమ్మెల్యే ఎన్నికలకు ముందు 'అక్క' పార్టీలో ఉండి ఆరితేరిన స్తంభం బ్రదర్స్.. అధికార పార్టీలో చేరి గతంలో లేనంతగా కమీషన్లు దండుకుంటున్నారని బహిరంగంగానే చర్చ జరుగుతోంది. అయితే ఇవన్నీ చాలవన్నట్లు తాము చెపితే కొందరు మండల అధికారులు వినడం లేదని భావించి, వారిపై చాడీలు చెప్పి వారిని తామే ట్రాన్స్ఫర్ చేశామని స్తంభం బ్రదర్స్ బహిరంగంగానే చెప్పుకుంటున్నట్లు సమాచారం. అయితే చెప్పుడు మాటలు వినే సదరు శాసనసభ్యుడితో పాటు ఆయన నీడ సైతం స్తంభాలకు సపోర్టా నిలవడంతో వారికి ఆడిందే ఆటగా.. పాడిందే పాటగా.. నడుస్తోంది.

### నేను ఎమ్మెల్యే పీఏను..

నేనే ఎమ్మెల్యే పీఏనని చెప్పుకుంటున్న స్తంభం బ్రదర్స్‌లో ఒకరు తన స్వగ్రామంలో జరిగే అభివృద్ధి పనులకు సైతం అడ్డుపడుతున్నట్లు తెలుస్తోంది. గ్రామంలో జరిగే అభివృద్ధి పనుల్లో తమకు సైతం కమీషన్లు కావాలంటూ ఇటు సర్పంచ్‌తో పాటు అటు వార్డు సభ్యులపై ఒత్తిడి తెస్తుండడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. పదవి లేకుంటేనే వీరి ప్రవర్తన తీరు ఇంతలా ఉందంటే.. ఒకవేళ వారికి ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే ఇంకెలా ఉ ంటుందోననే చర్చ ఆ మండల కేంద్రంలో జోరుగా సాగుతోంది.

# దృశ్య మాధ్యమాన్ని సామాజిక అస్త్రంగా మలిచిన వేదగిరి

## నేడు వేదగిరి రాంబాబు జయంతి



వేదగిరి రాంబాబు గుంటూరు జిల్లా తెనాలి తాలూకా చుండూరులో 1952 అక్టోబరు 14న పూర్ణచంద్రరావు, భార్గవి దంపతులకు జన్మించాడు. అతని తండ్రి ఎక్సైజ్ శాఖలో ఉద్యోగిగా తన విద్యుక్త ధర్మాన్ని సక్రమంగా నిర్వహిస్తున్నందున రాష్ట్రంలో అనేక ప్రాంతాలకు బదిలీ పై వెళ్ళవలసి వచ్చింది. అలా రాంబాబు బాల్యం, చదువు అంతా వివిధ ప్రాంతాలలో కొనసాగింది. రాంబాబు నాటకాలలో గానీ, సినిమా ఛాన్సులకోసం ప్రయత్నించడం కానీ అతని తండ్రికి యిష్టముండేది కాదు. డిగ్రీ చదువుతున్నప్పుడే అతనిలో సాహిత్యం పట్ల క్రమంగా అభిరుచి పెరిగింది. సాహితీ కారునిగా అతనికి యర్రంశెట్టి సాయి రచనలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. ప్రముఖ రచయితలైన యర్రంశెట్టి సాయి, ఆదివిష్ణు, విహారిలను గురుతుల్యులుగా భావించాడు. 1974 సంవత్సరంలో డిగ్రీ ఫైనలియర్‌లో చదువు తుండగా ఆంధ్రపత్రిక దీపావళి కథల పోటీకి సరదాగా పంపిన తన తొలికథ 'సముద్రం' బహుమతి సాధించి పెట్టింది. ఇక అదే క్రమంలో అప్పటి ప్రముఖ వార పత్రికలైన యువ, జ్యోతి, స్వాతి, ఆంధ్రపత్రికలకు వరసగా కథలు పంపిస్తుండే వాడు. కొంతకాలం ఆలిండియా రేడియోలో అనౌన్సర్‌గా పనిచేశాడు. రాంబాబు కథానికలకు రేడియో ద్వారా మంచి ప్రాచుర్యం లభించింది. ఆయన ఫ్రీలన్స్ జర్నలిష్టుగా వివిధ దినపత్రికలకు అనేక వ్యాసాలను వ్రాసి పంపించే



వాడు. కొంతకాలం ఆంధ్రభూమి వారపత్రికలో సీనియర్ జర్నలిస్ట్‌గా చేశాడు. పల్లకి వారపత్రికకు సంపాదకుడిగా పనిచేశాడు. ఎక్కడ ఏ ఉద్యోగం చేసినా తనలోని రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తునే ఉన్నాడు. దూరదర్శన్ అందుబాటు లోకి వచ్చాక దృశ్య మాధ్యమాన్ని సామాజిక అస్త్రంగా మలిచి జనాలలో మార్పు తేవాలని ఆశించాడు. ఆ క్రమంలోనే 'పాపం పసివాడు' సీరియల్‌ను 52 వారాలపాటు నిరంతరాయంగా దూరదర్శన్‌లో రూపొందించాడు. ఎన్నో కష్టనష్టాల కోర్చి దూరదర్శన్ టెలీ సీరియల్‌ను తన సొంత ఖర్చుతోనే భరించి తీర్చిదిద్దాడు.

రాంబాబు తీసిన టెలిఫిల్మ్‌కు ఉత్తమ నిర్మాత, దర్శకునిగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున బంగారు నంది అవార్డు దక్కింది. కృష్ణమోహన్ టైటిల్ సాంగ్ కు కూడా నంది అవార్డు వచ్చింది. తర్వాత 'అడవి మనిషి' సీరియల్‌కు రజిత నంది వచ్చింది. దూరదర్శన్‌లో శైలజా సుమన్, రమణీ సన్యాల్ వంటి వారితో కలిసి ఇన్‌హౌస్ సీరియల్ని చేశాడు. దాదాపు రెండు సంవత్సరాల పాటు ఎంతో కష్టపడి జైలు అధికారుల అనుమతి తీసుకుని రాష్ట్రంలోని పలు జైళ్లలో పరిస్థితుల ప్రభావం చేత ఖైదీలుగా శిక్ష అనుభవిస్తున్న ఖైదీల యథార్థ గాథలను తీసుకుని వాటినే తన కథా వస్తువులుగా చేసుకుని 'జైలుగోడల మధ్య' సీరియల్ ను రూపొందించాడు. అంతకుముందే అది స్వాతి వారపత్రికలో దాదాపు 60-70 వారాల పాటు పాఠకులను అలరించింది. రాంబాబు రాసిన 'జైలుగోడల మధ్య' పుస్తక రూపంలో దాదాపు చాలా భాషల్లో ప్రచురితమైంది. బాలసాహిత్యం లోనూ బాలల కోసం ఆయన చేసిన కృషి అజరామరం. "ఇంద్ర ధనుస్సు" అనే బాలల తొలి వీడియో మేగజైన్‌కు తొలి ఎడిటర్‌గా పనిచేశాడు.

తెలుగు కథానికలపై వాటిని చిన్నచూపు చూసే వారిపై ఆయన విమర్శనాస్త్రాలు సంధిస్తూ ఉండేవాడు. ఏనాటికైనా వాటికి కూడా జాతీయస్థాయి గుర్తింపు తేవాలని ఆయన ఉద్దేశం. గ్లోబల్ ఆసుపత్రి మీడియా ఇన్‌ఛార్జిగా పనిచేస్తూ తనవద్దకు సాయం కోసం వస్తే వాళ్లకు ఉదారంగా తనకు సాధ్యమైనంతలో వారికి తక్కువ ఖర్చుతోనే వైద్య సేవలు చేయిస్తూ ఇతోధిక సేవలందిస్తుండే వాడు.

వంద కథానికల పూర్తి వివరాలతో 'తెలుగు కథానిక డాట్ కామ్' కూడా ప్రారంభించాడు. 23 జిల్లాల కథానిక తీరుతెన్నులగూర్చి పోటీపెట్టి వ్యాసాల్ని సేకరించాడు. ఈ వ్యాస సంకలనాలను జయంతి సభలో ఆవిష్కరించాడు. అలాగే రచయితల చిరునామాలతో ఒక డైరెక్టరీని తీసుకొచ్చాడు. తప్పక చదవాల్సిన వంద కథానికలు అనే పేరుతో ఒక పుస్తకం వెలువరించారు. మహాకవి గురజాడ అప్పారావు 153వ జయంతి పురస్కరించుకుని సెప్టెంబర్ 21, 2015 న గురజాడ పురస్కారం అందజేసారు. ఆయన సుమారు రెండు వేలకు పైగా గురజాడకు సంబంధించిన కథలు, కథానికలు రచించారు.

సముద్రం గ్రంథానికి తెలుగు విశ్వ విద్యాలయం ఉ త్తమ కథానిక సంపుటి పురస్కారం, పాపం పసివాళ్ళు ధారావాహికం - రాష్ట్ర ప్రభుత్వ బంగారు నంది, అడవి మనిషి - టెలిఫిల్మ్ - రజత నంది, ఆకాశవాణిలో జింగిల్స్ కు ప్రసార భారతి పురస్కారం, రాష్ట్ర ప్రభుత్వం నుండి గురజాడ స్మారక పురస్కారం, గిడుగు పురస్కారం,

కొండేపూడి శ్రీనివాసరావు సాహితీ సత్కారం అందుకున్నారు. 2018ఆగస్టు 28న రాంబాబు ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.


రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494